Follow: @ANNTELUGU
22-06-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 170 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## బాబాతో పోటీపడి బాబు యోగా
# వయసు 76.. ఫిట్ నెస్ 26

**విజయవాడ, మహా:** బాబాతో పోటీపడి.. బాబు చేసిన యోగా వావ్ అనిపించింది. అనేకమంది మంత్రులు, నాయకులనే సిగ్గుపడేలా చేసింది. 76 ఏండ్ల వయసులో.. ఆ ఫిట్ నెస్ ఏంటి? ఆసనాలేంటి? అందరూ ఆశ్చర్యపోయేలా చేసింది. మంత్రముగ్దులను చేసింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు ప్రముఖ యోగా గురువు, పతంజలి సంస్థ అధినేత బాబా రామ్‌దేవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేడియంలో వందలాది మందితో కలిసి సీఎం చంద్రబాబు యోగా సాధన చేశారు. కేవలం ఒక పద్ధతిగా కాకుండా, వేదికపై ఉన్న యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో ఏమాత్రం తగ్గకుండా పోటీ పడుతూ ఆయన రకరకాల ఆసనాలు వేయడం అక్కడ ఉన్న వారందరినీ విశేషంగా ఆకట్టుకుంది. సాధారణంగా యువకులే వేయడానికి కాస్త ఇబ్బందిపడే అత్యంత కష్టమైన 'సేతు బంధనాసనాన్ని' 76 ఏళ్ల వయసులో సీఎం

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



## స్విట్జర్లాండ్‌లో అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు
చర్చల్లో పురోగతి
02



## బీజేపీ నా రాజ్యసభ సీట్ చోరీ చేసింది
- సిల్లీరీజన్స్‌తో నామినేషన్ తిరస్కరించారు
- మీనాక్షి నటరాజన్ సంచలన కామెంట్స్

02



## ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ 2026 రీఎగ్జామ్
- దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది హాజరు

03

## రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పించండి
- సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీచీఫ్ లేఖ

02



## పవన్ కల్యాణ్ కమలంలో ఒక రెక్క
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

02


# ఫ్యాబ్ భూ మాయ!

**తెరపైకి 2007 నాటి భూ భాగోతం**

రూ.200 కోట్ల అంచనాతో ప్రాజెక్టు

రూ.500 కోట్ల బ్యాంకు రుణం

- ఎకరం ఒక్క రూపాయి చొప్పున కేటాయింపు
- అరవై ఏళ్ల పాటు 100 ఎకరాల లాంగ్ లీజు
- ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో దగా
- ఎస్బీఐ కేసుతో బండారం బట్టబయలు
- కోర్టుకెక్కిన బ్యాంకు.. మొదలైన లీగల్ వార్
- వ్యవహారంపై రేవంత్ సర్కారు ప్రత్యేక దృష్టి
- నాటి లీజు భాగోతంపై విచారణకు ఆదేశం




(రాజేష్ జైన్ నిడార్కర్) : ఒకప్పుడు దేశాన్నే ఆకర్షించిన హైదరాబాద్ 'ఫ్యాబ్ సిటీ' ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. అతితక్కువ ధరలకే భూముల కేటాయింపు, వేల కోట్ల వ్యవహారం, లక్షల కోట్ల వ్యాపారం.. అంతా కాగితాలకే పరిమితమై భారీ కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారం వెనక బడా కంపెనీల మాయాజాలం వెలుగులోకి వచ్చింది. రూ.200 కోట్ల అంచనాతో ప్రాజెక్టు డీపీఆర్ను సమర్పించి ప్రభుత్వ సిఫారసుతో సుమారు రూ.500 బ్యాంకు

మిగితా 2వ పేజీలో



## ముంబైలో.. సీఎం రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా ముంబైలో ఎన్సీపీ నేత సుప్రియాసూలే కుమార్తె వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్మీయంగా పవార్ కుటుంబసభ్యులు రేవంత్ ను స్వాగతించారు. ముంబై వేడుకలో రేవంత్ ప్రత్యేక ఆకర్షణగా మారారు. సీఎం దంపతులతో పాటు బిజెపి ఎంపీ సీఎం రమేష్, నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ దంపతులు తదితరులు కలిసి ఒకే ఫ్రేమ్ లో కనిపించగా, ఫొటో వైరల్ అయింది. **ముంబై, మహా**

## గాంధీ పేరు చెప్పి పేదల ఇండ్లు కూల్చొద్దు
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



02




# రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

- నేటి నుంచి కీలకాంశాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు
- 10 అంశాలపై రిపోర్టులు సిద్ధం
- 4 అంశాలపై ప్రోగ్రెస్ రిపోర్టులను విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు



**అమరావతి, మహా :** ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రజా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై 'ప్రోగెస్ రిపోర్ట్ 202426' పేరుతో విడుదల చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులను ఆదేశించారు. 2024లో అధికారం చేపట్టిన వెంటనే గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసంపై ఇచ్చిన 7 శ్వేత పత్రాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులా ఈ ప్రోగ్రెస్ రిపోర్టులు ఉండాలన్నారు. 7 శ్వేత పత్రాలతో పాటు... మరో 3 ముఖ్యమైన అంశాలపై ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదలపై మంత్రులు, అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సమీక్షించారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి, విద్యుత్ రంగం, శాంతి భద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ రంగాలపై ముఖ్యమంత్రి శ్వేత పత్రాలు విడుదల చేశారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన రాష్ట్రాన్ని రెండేళ్లలో వికాసం వైపు ఎలా తీసుకెళ్లింది... రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతలా పురోగతి సాధించింది... వంటి అంశాలను తాజా ప్రోగ్రెస్ రిపోర్టులో పొందుపరచాలని ముఖ్యమంత్రి చెప్పారు. రెండేళ్లలో చాలా శాఖల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, గవర్నెన్స్‌లో తెచ్చిన సంస్కరణలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఎలా గాడిలో పెట్టామో చెప్పడంతో పాటు ఫేక్ న్యూస్‌కు చెక్ పెట్టడమే ప్రోగ్రెస్ రిపోర్టుల ఉద్దేశమన్నారు. నాటి 7 శ్వేత అంశాలతో సహా ఈసారి కొత్తగా డెవలప్మెంట్, గవర్నెన్స్, వెల్ఫేర్ అంశాలపైనా రిపోర్టులు విడుదల చేయాలని సీఎం స్పష్టం చేశారు. అగ్రికల్చర్, ఇండస్ట్రీస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, టూరిజం అంశాలతో 'డెవలప్మెంట్' ప్రోగ్రెస్ రిపోర్ట్... ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా తెచ్చిన పాలసీలు, అనుసరించిన విధానాలు, చేపట్టిన సంస్కరణలతో 'గుడ్ గవర్నెన్స్' ప్రోగెస్ రిపోర్ట్...సంక్షేమం, పీ4 వంటి వాటితో 'వెల్ఫేర్ - ఎంపవర్మెంట్' ప్రోగ్రెస్ రిపోర్ట్ ఈసారి విడుదల చేయనున్నారు. వీటిలో ఫైనాన్స్, డెవలప్మెంట్, వెల్ఫేర్, గవర్నెన్స్... ఈ 4 అంశాలకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టును ముఖ్యమంత్రి విడుదల చేస్తారు. 6 పేపర్లు మంత్రులు రిలీజ్ చేసిన తర్వాత... మిగిలిన 4 పేపర్లు ప్రజల ముందుంచాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూలై 18కల్లా మొత్తం అన్ని రిపోర్టులు విడుదల చేసేలా ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఇవన్నీ విడుదల చేసిన తర్వాత... అన్నీ కలిపి పుస్తక రూపంలో తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతీ ఏడాది ప్రోగ్రెస్ రిపోర్టులు తప్పనిసరిగా ఇవ్వాలని ఈ సందర్భంగా చెప్పారు. ప్రోగ్రెస్ రిపోర్టులో ముందుగా సోమవారం విద్యుత్ రంగంపై ప్రోగ్రెస్ రిపోర్ట్ విడుదల చేయనున్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పలువురు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ కమలంలో ఒక రెక్క

- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



**హైదరాబాద్, మహా :** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కమలం పువ్వులో ఒక రెక్క అని, ఆయన బీజేపీ ఆడిస్తున్న ఆటలో పావుగా మారి వారు చెప్పినట్లు ఆడుతున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. రాజకీయంగా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు జీర్ణించుకోవట్లేదన్నారు. తాజాగా ఓ న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు ఉపవాసం ఉన్నానని చెప్పిన పవన్ కల్యాణ్ ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ గురించి మాట్లాడితే ఎవరు నమ్ముతారన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ముందుండి నడిపిస్తే ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది యూపీఏ ప్రభుత్వం సోనియా గాంధీ అన్నారు. తెలంగాణ ప్రజలకు మరో పార్టీ అక్కర్లేదన్నారు. తాను చిరంజీవికి తాను అభిమానినని కానీ పవన్ కల్యాణ్ తెలంగాణ ఆవిర్భావం రోజే వచ్చే సభలు పెడతామంటే లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలగదా అని ప్రశ్నించారు.




## కేటీఆర్ ఆస్ట్రేలియా పర్యటన

# ఓ దిక్సూచి కావాలి

- బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి
- కేటీఆర్ ఆస్ట్రేలియా పర్యటన సన్నాహక సమావేశాలు ప్రారంభం




**సిడ్నీ:** అక్టోబర్‌లో జరగనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిపాదిత ఆస్ట్రేలియా పర్యటనను విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు ప్రారంభించారు. సిడ్నీ,కాన్బెర్ర నగరాల్లో రెండురోజులుగా నిర్వహిస్తున్న సమావేశాల్లో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా నాయకులు, ప్రవాస తెలంగాణవాసులు, సంఘాలు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పర్యటనకు సంబంధించిన కార్యక్రమాల రూపకల్పన, వివిధ నగరాల్లో నిర్వహించాల్సిన సమావేశాలు, ప్రవాస తెలంగాణ వాసులతో ముఖాముఖి కార్యక్రమాలు, యువతతో ప్రత్యేక చర్చలు, అలాగే సమన్వయ కమిటీల ఏర్పాటుపై విస్తృతంగా చర్చించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న నూతన కమిటీలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు మరియు సంస్థాగత బలోపేతంపై పాల్గొన్న వారి అభిప్రాయాలను సేకరించారు. సిడ్నీ సమావేశంలో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి, సాయిరాం ఉప్పు, రాజేష్‌రాపోలు, మర్రి వెంకట్ రెడ్డి సుతారి శ్రీనివాస్, సుతారి మధు, రవిశంకర్ దూపాటి, రవిచింతమణి, మహేష్,సాయి గుప్తా, రామ్ మద్దూరి, లక్ష్మణ్ నల్లన్, రాహుల్, పరశురాం తదితరులు పాల్గొన్నారు. కాన్బెర్రలో నిర్వహించిన సమావేశంలో రవి సాయల, రాకేష్ లక్కరాసు, వీరు సాంబరాజు, అనూప్ రెడ్డి, అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేటీఆర్ ఆస్ట్రేలియా పర్యటన ప్రవాస తెలంగాణ సమాజానికి ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తుందని, తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ రాజకీయాలు మరియు ప్రవాస భారతీయుల పాత్రపై విస్తృత చర్చలకు ఈ పర్యటన వేదిక కానుందని పేర్కొన్నారు. పర్యటనను విజయవంతం చేయడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# బాబాతో పోటీపడి బాబు యోగా

(మొదటి పేజీ తరువాయి)




చంద్రబాబు నాయుడు ఎంతో సులువుగా ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఆయన శారీరక దృఢత్వం, నిరంతర క్రమశిక్షణ, మరియు ఫిట్‌నెస్ స్థాయిని చూసి స్వయంగా బాబా రామ్‌దేవ్ సైతం అభినందించారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా ముఖ్యమంత్రి ఇంత చురుగ్గా, ఉత్సాహంగా యోగాసనాలు వేసిన ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ వయసులో ఆయన ప్రదర్శించిన ఎనర్జీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువతకు మరియు ప్రజలకు ఒక గొప్ప ఆరోగ్య స్ఫూర్తిగా నిలుస్తోందని నెటిజన్లు కొనియాడుతున్నారు.

# ఫ్యాబ్ భూ మాయ!

(మొదటి పేజీ తరువాయి )



రుణం పొందడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇది ఇప్పటి వ్యవహారం కాదు.. 2007లో రూ.500 కోట్లంటే... ఇప్పటి లెక్క ప్రకారం రూ. లక్షల కోటల పైమాటేనని నిపుణులు చెబుతున్నారు. విషయం బయటకు పొక్కకుండా ఎకరం ఒక్క రూపాయి చొప్పున కేటాయింపులు జరిగినట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, రావిర్యాల గ్రామంలోని ఫ్యాబ్ సిటీ పరిధిలో ఈ భారీ భూ కుంభకోణం జరిగింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం నాటి భూ అక్రమాల వ్యవహారం తాజాగా తెరపైకి రావడం పట్ల రేవంత్ సర్కారు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తోంది. వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కమిటీని నియమించి ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా 100 ఎకరాల భూమిని అరవై ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడమేంటన్న కోణంలో విచారణ జరుపుతోంది. ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో దగా జరిగిన తరుణం, పైగా ప్రస్తుతం తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు లోపల ఇంతటి ఖరీదైన భూముల దురాక్రమణ లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆ భూముల స్వాధీనం దిశగా అంతర్గత కసరత్తు మొదలుపెట్టింది. ఫ్యాబ్ సిటీ భూములపై ఇచ్చిన రుణాలను తిరిగి తీసుకునే క్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) హైకోర్టులో దాఖలు చేసిన కేసుతో బండారం బట్టబయలైంది. కోర్టుకెక్కిన బ్యాంకుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా లీగల్ వార్ మొదలుపెట్టింది. ప్రస్తుతం లక్షల కోట్ల విలువైన ఆ భూమిని ప్రజా ప్రయోజనార్థం ప్రభుత్వం స్వాధీనం చేసుకునే క్రమంలో టీజీఐఐసీ ఇచ్చిన నోటీసులు, సెజ్లో పెట్టుబడులు పెట్టిన సంస్థల ఆందోళన, రుణమిచ్చిన బ్యాంకుల ప్రతిస్పందనతో వ్యవహారం ఒక్కొక్కటిగా బహిర్గతమవుతోంది. గడిచిన వారం, పది రోజులుగా ఈ వ్యవహారంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. హైదరాబాద్ లోని ఫ్యాబ్ సిటీ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) భూమి వివాదం ఇప్పుడు తెలంగాణలో పెద్ద దుమారం రేపుతోంది.

ఒకవైపు ప్రభుత్వం భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని చూస్తోంది. మరోవైపు ఎస్బీఐ బ్యాంక్ ఆ భూమిని తమ రుణానికి సెక్యూరిటీగా పరిగణిస్తోంది. ఇదే సమయంలో తెలంగాణ హైకోర్టు ఒక కీలక ప్రశ్న లేవనెత్తింది. కేవలం రూ.200 కోట్ల ప్రాజెక్టుకు సుమారు రూ.500 కోట్ల రుణం ఎలా మంజూరు చేశారు?. ఈ ఒక్క ప్రశ్నతో మొత్తం ఫ్యాబ్ సిటీ వ్యవహారం వార్తల్లోకి వచ్చి సంచలనంగా మారుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు మొదలు పెట్టి ఆర్థిక సుస్థిరత సాధించడం కోసం వినూత్న ఆలోచనతో రాజధాని నగరం చుట్టూ ప్రత్యేక ఆర్థిక మండళ్లను (స్పెషల్ ఎకనమిక్ జోన్లు) ప్రవేశపెట్టింది. ఇప్పుడు భూమి తక్కువ ధరకు ఇచ్చినా, భవిష్యత్తులో వేల కోట్ల పెట్టుబడులు, వేల ఉద్యోగాలు, అనుబంధ పరిశ్రమలు వస్తాయన్న ఆకాంక్షతో, భవిష్యత్ తరాలు బాగుపడతాయన్న ముందుచూపుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 94ద్వారా 2007 ఏప్రిల్ 28న సెమ్ ఫ్యాబ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్కు భూమిని కేటాయించింది. మొత్తం 100 ఎకరాల భూమి. 66 ఏళ్ల లీజుతో సంస్థకు, ప్రభుత్వానికి మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఎకరానికి ఏడాదికి రూ.1 చొప్పున లీజు కేటాయింపు 2007 జూన్ 25 నుంచి లీజు ఒప్పందం అమల్లోకి వచ్చింది. అదే రోజు భూమి స్వాధీనం కూడా అప్పగించారు. అంటే అప్పట్లో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చాలా ప్రాధాన్యతతో తీసుకుందన్న విషయం ఇక్కడ స్పష్టమవుతోంది.

సిమ్ ఇండియా ఫ్యాబ్ మొదటి దశలో అసెంబ్లీ, టెస్టింగ్, మార్కెటింగ్, ప్యాకేజింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రభుత్వానికి తెలిపింది. అవగాహన ఒప్పందంలో కూడా ఈ విషయం స్పష్టంగా ఉంది. తర్వాత మొదటి దశలో పూర్తి స్థాయి సెమీకండక్టర్ ఫ్యాబ్ నిర్మిస్తామని ప్రకటించింది. మొత్తం పెట్టుబడి బిలియన్ డాలర్ల స్థాయికి చేరుతుందని చెప్పింది. ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టు ద్వారా భారీ పరిశ్రమల ఎకో సిస్టమ్ ఏర్పడుతుందని ఆశించింది. ఈ కేసుపై తాజాగా విచారణ జరిగిన తెలంగాణ హైకోర్టు రుణ వితరణలో బ్యాంకు అధికారులు శిబిచక్రవర్తిని మించి పోయారని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటామని నోటీసు ఇచ్చిన భూమిపై హైకోర్టు స్టే ఇస్తే, అలాంటి భూమిని తాకట్టు పెట్టుకుని రుణం ఎలా మంజూరు చేస్తారని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)ను ప్రశ్నించింది. రూ.200 కోట్ల ప్రాజెక్టుకు రూ.500 కోట్లు రుణం మంజూరు చేసిన ఆ బ్యాంకు వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, రావిర్యాల గ్రామంలోని ఫ్యాబ్ సిటీ పరిధిలో సిమ్ ఇండియా ప్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి కేటాయించిన 100 ఎకరాల స్వాధీనానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కాగా ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ బెంగళూరు ఎస్బీఐ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టి స్టే ఉన్న భూమికి రుణం ఇచ్చిన బ్యాంకు అధికారిపై సీబీఐకి ఫిర్యాదు చేశారా? కేసు నమోదైందా? అని ఎస్బీఐని ప్రశ్నించింది. ఒకవేళ ఫిర్యాదు చేయకపోతే సుమోటోగా కోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తుందని స్పష్టం చేసింది. "ప్రజలు నమ్మకంతో బ్యాంకుల్లో పెట్టిన సొమ్మును అడ్డగోలుగా రుణాలు మంజూరు చేస్తున్నారు. పరిశ్రమలు పెడతామంటూ ప్రభుత్వం నుంచి భూమిని తీసుకోవడం. దాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకుని పారిపోవడం, బ్యాంకులు దివాలా తీయడం జరుగుతోంది. ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భూమిని కేటాయిస్తోంది. ఆ లక్ష్యాన్ని కంపెనీలు నీరుగారుస్తున్నాయి. వాటికి బ్యాంకులు సహకరిస్తున్నాయి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటీషన్లో మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరించిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి, టీజీఐఐసీ, సెమ్ ఇండియా ఫ్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్కు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 25న ఉండడంతో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసేందుకు ఆదేశాలిచ్చింది.

**అసలు 'ఫ్యాబ్ సిటీ' వ్యవహారం మొదలైందిలా..**

200607 కాలంలో భారత్లో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ దాదాపు లేదు. ప్రపంచంలోని పెద్ద చిప్ తయారీ సంస్థలు అమెరికా, తైవాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లోనే ఉండేవి. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశంలో సెమీకండక్టర్ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాలు తీసుకొచ్చింది. భారీ విదేశీ పెట్టు బడులను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక రాయితీలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్ సమీపంలో ఫ్యాబ్ సిటీ ప్రాజెక్టును ప్రకటించింది. లక్ష్యం ఒక్కటే. ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ తయారీ కేంద్రాన్ని హైదరాబాద్లో ఏర్పాటు చేయడం. అప్పటి ప్రభుత్వం సెమ్ ఇండియా ఫ్యాట్ ను ఫ్యాబ్ సిటీ లో ప్రధాన లేదా యాంకర్ ఇండస్ట్రీగా తీసుకురావాలని భావించింది. అందుకే 100 ఎకరాల భూమిని 66 ఏళ్ల లీజుపై కేటాయించింది. ఎకరానికి సంవత్సరానికి కేవలం రూ. 1 లీజు రుసుము నిర్ణయించింది. విద్యుత్ సబ్సిడీలు ప్రకటించింది. నీటి సరఫరా హామీ ఇచ్చింది. వ్యాట్, జీఎస్టీ రీయింబర్స్మెంట్ వంటి పన్ను రాయితీలు ఇచ్చింది. సెజ్ ప్రయోజనాలు కల్పించింది.

**'ఫ్యాబ్ సిటీ' భూ వ్యవహారం వెనక అంతుచిక్కని ప్రశ్నలెన్నో..**

'ఫ్యాబ్ సిటీ' భూ వ్యవహారంలో బ్యాంకు అన్ని నిబంధనలు పాటించిందా? భూమిని చట్టబద్ధంగా సెక్యూరిటీగా తీసుకున్నారా? ప్రభుత్వం భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవచ్చా? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికిన తర్వాతే ఫ్యాబ్ సిటీ కేసులో అసలు చిత్రం పూర్తిగా స్పష్టమవుతుందని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రధాన వివాదం ఏమిటంటే, ఒకే భూమిపై మూడు వేర్వేరు పక్షాలు హక్కులను క్లెయిమ్ చేస్తున్నాయి. ప్రాజెక్టు అమలు కాలేదు కాబట్టి భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ భూమి మా రుణానికి సెక్యూరిటీగా ఉంది కాబట్టి మా హక్కులు ముందుగా పరిగణించాలని వాదిస్తూ ఎస్బీఐ కోర్టుకెక్కింది. నాడు ప్రభుత్వ ఒప్పందంతో తాము చట్టబద్ధంగా భూమి తీసుకున్నామని, మాకు హక్కులు ఉన్నాయని కంపెనీ చెబుతోంది. దీంతో ప్రభుత్వం, బ్యాంకు కంపెనీ మధ్య పూర్తి స్థాయి న్యాయపరమైన చిక్కులు, సవాళ్లు ఏర్పడ్డాయి. ఇప్పుడు కేసులో ఆ భూమిపై ఉన్న రుణం చెల్లించేదెవరన్నదే అత్యంత కీలకమైన అంశంగా మారింది. రూ.200 కోట్ల ప్రాజెక్టుకు రూ.500 కోట్ల రుణం ఎలా మంజూరు చేశారన్న హైకోర్టు ప్రశ్నపై బ్యాంకు సమాధానం చెప్పలేకపోతోంది. ఎందుకంటే సాధారణంగా బ్యాంకులు కేవలం ప్రాజెక్ట్ వ్యయం అంచనా ఆధారంగా మాత్రమే రుణం ఇవ్వవు. వారు చాలా అంశాలను పరిశీలిస్తారు. ఫ్యాబ్ సిటీ విషయంలో భూమి విలువ, భవిష్యత్ ఆస్తుల విలువ, యంత్రాలు, ప్లాంట్, ప్రామోటర్ల గ్యారంటీలు, అదనపు కోలాటరల్, గ్రూప్ కంపెనీల ఆస్తులు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను పరిగణనలోకి తీసుకోలేదన్న విషయం స్పష్టమవుతోంది.

**బ్యాంకులు పెద్ద రుణాలు మంజూరు చేసే విధానమిదీ..**

1. డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను కంపెనీ పూర్తి ప్రాజెక్ట్ రిపోర్టు సమర్పిస్తుంది.
2. టెక్నో ఎకనామికల్ అప్రైసల్ నిపుణులు ప్రాజెక్టు సాధ్యాసాధ్యత, మార్కెట్ పరిస్థితులు, ఆదాయం, రిస్క్ విశ్లేషిస్తారు.
3. స్వతంత్ర సంస్థలు భూమి విలువ, యంత్రాల విలువ, ఆస్తుల విలువ అంచనా వేస్తాయి.
4. క్రెడిట్ అప్రూవల్ ఇచ్చేటప్పుడు జోనల్ కమిటీ, కార్పొరేట్ క్రెడిట్ కమిటీ, బోర్డు స్థాయి కమిటీ అనుమతులు అవసరం.
5. బ్యాంకు సాధారణంగా మార్టిగేజ్, హైపోతికేషన్, పర్సనల్ గ్యారెంటీ పత్రాలు తీసుకుంటుంది.
6. రుణం ఇచ్చిన తర్వాత డబ్బు ఎక్కడ ఖర్చవుతోంది?, ప్రాజెక్టు ఎంతవరకు పూర్తయింది? అనేది బ్యాంకు పర్యవేక్షించాలి.

**తర్వాత తెరవెనక పరిణామాలు జరిగాయిలా..**

2007 నుంచి 2010 మధ్య ప్రాజెక్టు కోసం భారీ ప్రకటనలు వచ్చాయి. వేలాది ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. భారీ పెట్టుబడులు వస్తాయని చెప్పారు. కానీ ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ప్లాంట్ నిర్మాణం జరగలేదు. వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కాలేదు. అక్కడి నుంచే వివాదం మొదలైంది. ప్రభుత్వం భూమిని తిరిగి తీసుకోవాలని అనుకుంది? ప్రభుత్వం అభిప్రాయం ప్రకారం, కంపెనీ భూమి కేటాయింపు సమయంలో ఒప్పుకున్న షరతులను పూర్తిగా అమలు చేయలేదు. అందువల్ల 201011 ప్రాంతంలో భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే చర్యలు ప్రారంభించింది. అయితే కంపెనీ దీనిని వ్యతిరేకించింది. రుణదాతలు కూడా వ్యతిరేకించారు. దీంతో కేసులు ప్రారంభమయ్యాయి. సెమ్ ఇండియా ఫ్యాబ్ కంపెనీకి సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్న పబ్లిక్ రికార్డులు, ఎంసీఏ డేటా, కోర్టు పత్రాల ప్రకారం.. బండారు వెంకయ్య నాయుడు, కొండమూరి శ్రీనివాస ప్రసాద్, మణికొండ రాజేంద్ర, వినోద్ కుమార్ అగర్వాల్లు డైరెక్టర్లుగా ఉన్నట్లు పేర్లు కనిపిస్తున్నాయి

## ప్రశాంతంగా ముగిసిన

# నీట్ యూజీ 2026 రీఎగ్జామ్

- దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది హాజరు

**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూసిన నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం (జూన్ 21) ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించారు. దివ్యాంగులకు 6.20 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించారు. సుమారు 23 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. భారత్‌తో పాటు రియాద్‌లోని అంతర్జాతీయ కేంద్రంలో కూడా పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. కాగా, ఎప్పట్లాగానే పలు పరీక్ష కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు, తమను లోపలికి అనుమతించకపోవడంతో కన్నీటి పర్యంతమయ్యారు. పరీక్ష రాసిన విద్యార్థుల ప్రాథమిక విశ్లేషణ ప్రకారం, ఈసారి ప్రశ్నపత్రం మొత్తం మీద మధ్యస్థంగా ఉంది. అన్ని విభాగాల్లోకెల్లా ఫిజిక్స్ అత్యంత కఠినంగా ఉందని, ఆ తర్వాత కెమిస్ట్రీ ఉందని విద్యార్థులు తెలిపారు. అయితే, బయాలజీ విభాగం మాత్రం చాలా సులభంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష ముగియడంతో, వివిధ కోచింగ్ సంస్థలు త్వరలోనే అనధికారిక ఆన్సర్ కీలను విడుదల చేయనున్నాయి.



# రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పించండి

**సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీచీఫ్ లేఖ**



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలులో ఘోరంగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. రాష్ట్రంలో నెరవేరని కాంగ్రెస్ గ్యారంటీలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి స్వయంగా ఒక వినతి పత్రాన్ని సమర్పించేందుకు వీలుగా.. ఆయనతో తనకు అపాయింట్‌మెంట్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి రామచందర్ రావు ఆదివారం ఒక బహిరంగ లేఖ రాశారు. రాహుల్ గాంధీతో అపాయింట్‌మెంట్ కల్పించడంలో విఫలమైతే.. అది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి, ఇక్కడి అమాయక ప్రజలకు చేసిన అత్యంత తీవ్రమైన ద్రోహాన్ని బహిర్గతం చేస్తుందని ఎన్.రామచందర్ రావు స్పష్టం చేశారు.

# గాంధీ పేరు చెప్పి పేదల ఇండ్లు కూల్చొద్దు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**రాజేంద్రనగర్, మహా :** గాంధీ పేరుతో రేవంత్ రెడ్డి చేస్తున్న విధ్వంసాన్ని చూస్తే మహాత్మా గాంధీ ఆత్మ కూడా ఘోషిస్తుందని కేటీఆర్ అన్నారు. ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీకి నిజాయితీ ఉంటే పేదల భూములు లాక్కోవద్దని, వారికి అన్యాయం చేయవద్దని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. స్థానికంగా బీజేపీ నేతలు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నా, వారి సొంత ప్రభుత్వం మాత్రం ఇండ్లు కూల్చేందుకు అనుమతులు ఇస్తోందని అన్నారు. గతంలో వచ్చిన అర్జున్ రెడ్డి సినిమా హిట్ అయితే రేవంత్ రెడ్డి ఫ్లాప్ సినిమా అని ఈ సందర్భంగా కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి పేరుతో పార్టీ మారిన ప్రకాష్ గౌడ్ గత రెండున్నరేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని కేటీఆర్ విమర్శించారు. ఎంతమంది పెద్ద నాయకులు పార్టీని వీడినా గులాబీ సైన్యం బలంగానే ఉందని, రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా తీసుకొచ్చి బీఆర్ఎస్ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీజేపీ నా రాజ్యసభ సీట్ చోరీ చేసింది

- మీనాక్షి నటరాజన్ సంచలన కామెంట్స్

**హైదరాబాద్, మహా :** బీజేపీ నిర్దాక్షిణ్యంగా తన రాజ్యసభ సీటు చోరీకి పాల్పడిందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. ఇవాళ గాంధీభవన్‌లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో భాగంగా ఎస్ఐఆర్‌పై పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని అన్నారు. ప్లాన్ ప్రకారమే తన నామినేషన్ వెంటనే తిరస్కరించారని మీనాక్షి నటరాజన్ ఫైర్ అయ్యారు.నామినేషన్ తిరస్కరణ విషయంలో తనకు వివరణ కూడా ఇచ్చే సమయం ఇవ్వలేదని మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. జార్ఖండ్ లో బీజేపీ అభ్యర్థి పరిమళ్ నత్వానికి మాత్రం అన్ని విషయాలపై వివరణ ఇచ్చేందుకు టైమ్ ఇవ్వడం అన్యాయం కాదా.. అని ప్రశ్నించారు. ఏదైనా ఫిర్యాదు వస్తే తన వివరణ తీసుకోవాలని, పరిమళ్ నత్వానికి ఒక రూల్, తనకు ఒక రూలా అని మండిపడ్డారు. నారాయణ పేటలో మహిళ ఆరోపణలపై వెంటనే చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళ ఆరోపణల కేసు అప్పుడు ముగిసిపోయిందని తెలిపారు. సిల్లీ రీజన్ చూపి తనకు రాజ్యసభ ఎంపీ రాకుండా చేశారని ధ్వజమెత్తారు. బీజేపీ తన సీట్ చోరీకి పాల్పడిందని, ఎన్నికల కమిషన్ కూడా కాంప్రమైజ్ అయిందని మీనాక్షి నటరాజన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

# ఫాదర్స్ డే నాడు విషాదం.



**ఖమ్మం, మహా.** : ఫాదర్స్ డే.. తండ్రికి తన బిడ్డల నుంచి ఆప్యాయతను, ప్రేమను పొందే రోజు. ఇంటిల్లిపాది సంతోషంగా గడపాల్సిన ఆ రోజు, ఒక తండ్రికి జీవితాంతం గుర్తుండిపోయే తీరని శోకాన్ని, గుండెకోతను మిగిల్చింది. ఖమ్మం జిల్లాలోని గాంధీనగర్‌లో చోటుచేసుకున్న ఒక అత్యంత విషాదకరమైన ఘటన, యావత్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కన్న తల్లి తీసుకున్న అత్యంత కఠినమైన, అనాలోచితమైన నిర్ణయం ఇద్దరు పసి ప్రాణాలను మృత్యు ఒడిలోకి పంపింది. కుటుంబ కలహాలు ఎంతటి దారుణానికి దారితీస్తాయో ఈ ఘటన అద్దం పడుతోంది.

ఖమ్మం త్రీ టౌన్ పరిధిలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న లింగరాజు, స్వాతి దంపతులకు ఇద్దరు కుమారులు. ఏడేళ్ల వేదిక్ కుమార్, ఐదేళ్ల తనిష్క్. పసిపిల్లల నవ్వులతో నిత్యం కళకళలాడే ఆ ఇంట్లో, ఇటీవల కొన్ని రోజులుగా కుదురు లేని పరిస్థితులు తలెత్తినట్లు సమాచారం. దంపతుల మధ్య నెలకొన్న కుటుంబ కలహాలు, మనస్పర్థలు రోజురోజుకూ పెరిగి, చివరకు ఒక భయంకరమైన విషాదానికి దారితీశాయి. ఫాదర్స్ డే రోజున తమ బిడ్డలతో గడపాల్సిన ఆ తండ్రి, ఆ బిడ్డల మృతదేహాలను చూసి రోదించాల్సి రావడం ఎంతటి దురదృష్టకరం.

ఆదివారం ఉదయం పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో, ఆవేదనలో ఉన్న స్వాతి, తాను తీసుకున్న అత్యంత దారుణమైన నిర్ణయాన్ని తన చిన్నారుల పాలిట శాపంగా మార్చేసింది. ఇద్దరు కొడుకులకు ఎలుకల మందును తినిపించి, తానూ తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, మృత్యువుతో పోరాడిన ఆ చిన్నారులు వేదిక్ కుమార్, తనిష్క్ చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఇద్దరు కొడుకులు కళ్లముందే విగతజీవులవ్వడం ఆ తండ్రిని కోలుకోలేని బాధలోకి నెట్టేసింది. మరోవైపు, ఈ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన తల్లి స్వాతి పరిస్థితి కూడా అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలుపుతున్నారు.


ఒక్క క్షణం ఆగ్రహం, తీవ్రమైన మానసిక సంఘర్షణ లేదా కుటుంబ సమస్యల వల్ల తీసుకునే చిన్న తప్పు నిర్ణయం, ఒకే రోజు రెండు పసి ప్రాణాలను బలితీసుకోవడమే కాకుండా, ఒక నిండు కుటుంబాన్ని నాశనం చేసింది. చిన్నారుల అల్లరితో మార్మోగాల్సిన ఆ ఇల్లు, ఇప్పుడు నిశ్శబ్ద రోదనతో, కన్నీటి సంద్రంగా మారిపోయింది. సమాజంలో ఇటువంటి ఘటనలు జరుగుతున్నప్పుడు, సమస్యలు ఎంతటివైనా ఆత్మహత్య వంటివి పరిష్కారం కావని, ప్రాణాల కంటే ఏదీ మిన్న కాదని అందరూ గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది. పసిపిల్లల భవిష్యత్తును కన్నతల్లే చిదిమేయడం అనేది అత్యంత దయనీయమైన విషయం. ఆ తల్లి మృత్యువుతో పోరాడుతున్నా, చిన్నారుల అకాల మరణం మాత్రం ఆ ఇంటిని, ఆ పరిసరాలను విషాదంలోకి నెట్టేసింది. ఖమ్మం గాంధీనగర్ ప్రాంతంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా విషాద ఛాయలే కనిపిస్తున్నాయి. అభం శుభం తెలియని ఆ చిన్నారుల మృతికి స్థానికులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు

# సామాన్యులకు ఇబ్బంది వద్దు

- ఆగాల్సి వస్తే నేనే ఆగుతా!
- ప్రజల సౌకర్యానికే పెద్దపీట వేస్తున్న ప్రధాని మోదీ.
- నీట్ విద్యార్థుల కోసం దిల్లీ విమానాశ్రయంలోనే ప్రధాని నిరీక్షణ.
- గతంలో వారణాసి, చండీగఢ్ పర్యటనల్లోనూ ఇదే ఆదర్శం.



**ఢిల్లీ, మహా**: దేశంలో వీఐపీల పర్యటనలంటే ముందుగా గుర్తొచ్చేది ట్రాఫిక్ ఆంక్షలు, సామాన్యుల అవస్థలు. కానీ, దేశ ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం దశాబ్దాలుగా పాతుకుపోయిన వీఐపీ సంస్కృతికి స్వస్తి పలుకుతూ, సామాన్య ప్రజల సౌకర్యానికే పెద్దపీట వేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల వల్ల సాధారణ పౌరులకు దైనందిన జీవితంలో ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు సర్వత్రా ప్రశంసలు అందుకుంటున్నాయి. తాజాగా నీట్ యూజీ పరీక్ష రాసే లక్షలాది మంది విద్యార్థుల కోసం ఆయన తన ప్రయాణాన్ని కొద్దిసేపు ఆపుకుని విమానాశ్రయంలోనే వేచి ఉండటం ఆయన విధానాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా ఆదివారం నీట్ యూజీ పునఃపరీక్ష జరిగిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ పర్యటన ముగించుకుని కోల్‌కతా నుంచి దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీ.. ఆ సమయంలో తన కాన్వాయ్ బయలుదేరితే పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని భావించారు. ఎంతో ముఖ్యమైన కెరీర్ నిర్ణయాత్మక పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకోకూడదనే సదుద్దేశంతో ప్రధాని మోదీ నేరుగా తన నివాసానికి వెళ్లకుండా, పరీక్ష ప్రారంభమై విద్యార్థులంతా కేంద్రాలకు చేరుకునే సమయం వరకు విమానాశ్రయంలోని లాంజ్‌లోనే ఉండిపోయారు.ప్రధాని మోదీ ఇలా సామాన్యుల కోసం తన పర్యటనలను, కార్యక్రమాలను మార్చుకోవడం ఇదే తొలిసారి కాదు. కొన్నేళ్ల క్రితం ఆయన తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించినప్పుడు సైతం ఇలాంటి ఆదర్శప్రాయమైన నిర్ణయమే తీసుకున్నారు. పగటిపూట తాను పర్యటిస్తే ప్రజలకు, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని భావించిన ప్రధాని.. అర్ధరాత్రి ఒంటి గంటకు నగరమంతా ప్రశాంతంగా నిద్రపోతున్న సమయంలో వారణాసి వీధుల్లో, రైల్వే స్టేషన్‌లో కలియతిరుగుతూ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షించారు. తన భద్రతా సిబ్బంది వల్ల సామాన్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నదే ఆయన ప్రధాన ఉద్దేశం.గతంలో చండీగఢ్‌లో జరిగిన మరో ఘటన మోదీ ఆలోచనా విధానానికి అద్దం పడుతుంది. ఒక విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు ప్రధాని అక్కడికి వెళ్లినప్పుడు, భద్రతా కారణాల దృష్ట్యా స్థానిక యంత్రాంగం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. ఈ విషయం తెలుసుకున్న మోదీ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నా పర్యటన వల్ల పాఠశాలలకు సెలవు ప్రకటించారా? అని అధికారులను నిలదీశారు. ప్రధాని పర్యటన వల్ల విద్యార్థులు ఒక్కరోజు చదువు కూడా నష్టపోకూడదని అప్పటి హర్యానా గవర్నర్ కప్తాన్ సింగ్ సోలంకితో ఆయన స్పష్టం చేశారు. ఒక సామాన్య పౌరుడి రాకను ఎలా పరిగణిస్తారో, ప్రధాని పర్యటనను కూడా అలాగే చూడాలని అధికారులకు తేల్చిచెప్పారు. ఎవరైనా వేచి ఉండాల్సి వస్తే, అది నేనే కావాలి.. ప్రజలు కాదు అని ఆయన ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలు వీఐపీ సంస్కృతిపై ఆయనకున్న వ్యతిరేకతను చాటిచెబుతున్నాయి. నేటి నీట్ విద్యార్థుల కోసం ఆయన చేసిన నిరీక్షణ కూడా.. చూడటానికి చిన్నదే అయినప్పటికీ అత్యంత శక్తిమంతమైన ప్రజాస్వామ్య సూత్రాన్ని, 'ప్రజలే ప్రథమం' అనే గొప్ప సందేశాన్ని యావత్ దేశానికి చాటిచెబుతోంది.



# తెలంగాణ పామాయిల్ హబ్‌గా ఎదగాలి: మంత్రి తుమ్మల

- పది లక్షల ఎకరాలకు పామాయిల్ సాగు విస్తరణ లక్ష్యం
- పామాయిల్‌తో రైతులకు స్థిర ఆదాయం సాధ్యం
- కొత్త ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తామని వెల్లడి

**దమ్మపేట, మహా:** తెలంగాణను దేశంలోనే పామాయిల్ హబ్‌గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గుత్తావారిగూడెంలో ఆదివారం నిర్వహించిన పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. సాంప్రదాయ పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతున్న పరిస్థితుల్లో పామాయిల్ సాగు మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తోందన్నారు. చీడపీడలు, కోతుల బెడద, అకాల వర్షాల ప్రభావం తక్కువగా ఉండటంతో రైతులు పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు.రాష్ట్రంలో కనీసం పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగును విస్తరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, గత రెండేళ్లలోనే సుమారు రెండు లక్షల ఎకరాల్లో సాగు విస్తరించిందని తెలిపారు. పామాయిల్ తోటల్లో కోకో, జాజి, వక్క వంటి అంతర పంటలను సాగు చేసి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లోని పామాయిల్ తోటలు మలేసియాను తలపిస్తున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు.రైతుల సౌకర్యార్థం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సీజన్‌లో కల్లూరుగూడెం, వైరా ప్రాంతాల్లో కొత్త ఫ్యాక్టరీలను ప్రారంభిస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్ల తనకు ప్రత్యేక గౌరవం ఉందన్నారు. గండుగులపల్లి నుంచి గోపాలపురం వరకు రూ.17 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు చేయడంలో మంత్రి కీలక పాత్ర పోషించారని తెలిపారు. వ్యవసాయ కళాశాల ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారం, పామాయిల్ సాగు విస్తరణలో తుమ్మల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## కేంద్రంపై విమర్శలు మానాలి: బండి సంజయ్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం కేంద్రంపై విమర్శలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రాన్ని నిందిస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం రూ.6 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రస్తుతం అది రూ.8 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు విదేశీ పెట్టుబడులు కేటీఆర్ వల్ల కాకుండా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే వస్తున్నాయని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బండి సంజయ్ స్పష్టం చేశారు.




# నియోజకవర్గం అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..!

- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డికి కాంగ్రెస్ నేతల సవాల్.!
- ప్రాంతాభివృద్ధికి సీఎం వస్తే ఓర్వలేకపోతున్న గులాబీ నాయకులు
- ఆరుట్ల స్కూల్ ను సందర్శిస్తే రూపురేఖలు ఎలా మార్చామో తెలుస్తోంది...
- అభివృద్ధి అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఈ సారి డిపాజిట్లు గల్లంతు...
- ఈ ప్రాంత అభివృద్ధికి తపనపడే వ్యక్తి మల్ రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం జూన్ 21 మహా: 14ఏళ్లలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిపై, రెండున్నరేళ్లలో మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై దమ్ముంటే చర్చకు రావాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. ప్రజాప్రభుత్వంలో మల్ రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రాజకీయాలకతీతంగా కేటాయిస్తున్న నిధుల గురించి బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లనే అడగాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి... శనివారం కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను వారు తిప్పికొట్టారు. ఈ మేరకు ఇబ్రహీపట్నంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ఏదుల్లా పాండురంగారెడ్డి, వెదిరె హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, జడల రవీందర్ రెడ్డి, 'ఏ' బ్లాక్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్మ నరేందర్ రెడ్డి, లింగం ముదిరాజ్, ఇబ్రహీంపట్నం టౌన్ అధ్యక్షుడు గౌస్ పాష, కొంగర, తొర్రూర్, తుర్కయంజాల్ డివిజన్ల అధ్యక్షులు రమేశ్ ముదిరాజ్, అయిలయ్య, శ్రీనివాస్, కౌన్సిలర్లు నీళ్ల భానుబాబు, రాందాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...రైతుల గురించి మొసలి కన్నీరు కార్చుతున్న కిషన్ రెడ్డి.... రెండు పర్యాయాలు బీఆర్ఎస్ హయాంలో చేసిన రుణమాఫీ, ధాన్యం కొనుగోలు గురించి గుర్తు చేసుకోవాలి. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే ఏకకాలంలో 2లక్షలు రుణమాఫీ చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ధాన్యం కొనుగోలు చేయలేదని మాట్లాడుతున్నారు. మీరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో 10కేంద్రాలుంటే ఇప్పుడు మా ఎమ్మెల్యే ఆదేశాలతో 15కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయటం జరిగింది. ఒక్క బస్తా ధాన్యం కూడా తడవకుండా కొనుగోలు జరిగిందంటే, మేము చేసిన పకడ్బందీ చర్యలే ఇందుకు నిదర్శనం. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు మీ హయాంలో ఎప్పుడు రైతులకు అందుతాయో తెలియని దౌర్భాగ్యం. అదే ఇప్పుడు 72గంటల్లో రైతుల ఖాతాల్లో వేస్తున్నది నిజం కాదా అడిగి తెలుసుకోండి. రైతుబంధు పేరుతో బీఆర్ఎస్ వ్యాపారులు కోట్ల రూపాయలు కొల్లగొడుతుంటే, అసలైన రైతులను గుర్తించి, రైతుభరోసా పేరుతో 12వేల రూపాయలు పెట్టుబడి సాయం మా ప్రభుత్వం అందిస్తోంది.

**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సీఎంను నిధులు అడగలేదనడం సిగ్గుచేటు...**

9ఏళ్లలో ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ మీకు ఒక్కసారైనా దొరికిందా. ఓట్ల కోసం తప్పితే కేసీఆర్ ను ఏనాడైనా ఇబ్రహీంపట్నం తీసుకువచ్చారా, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటారు. 15రోజుల్లోనే 4సార్లు సీఎంను నియోజకవర్గానికి తీసుకువచ్చిన ఘనత ఆయనది. ఈ కడుపుమంటతోనే మీరు మాట్లాడుతున్నారు.

**విద్యారంగంలో మార్పునకు ఆరుట్ల నుంచి శ్రీకారం...**

విద్యరంగంలో మార్పునకు ఆరుట్ల నుంచి శ్రీకారం చుడుతుంటే, ఓర్వలేని గులాబీ మూకలు లేని వీడియోలు సృష్టించి, మా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పేద పిల్లల భవిష్యత్ కోసం చేసే ప్రయత్నాలను కూడా మీరు ఓర్వలేకపోతున్నారు. ఒక్కసారి సబితారెడ్డి, కిషన్ రెడ్డి.... మీ మనవలుమనవరాళ్లతో ఆరుట్ల స్కూల్ను సందర్శిస్తే, దానిని ఎంత గొప్పగా తీర్చిదిద్దామో ఆ పిల్లలే మీకు చెబుతారు.

**కోహెడలో మార్కెట్ కు స్థలం కేటాయిస్తే, పదేళ్లు ఏం చేశారు?**

అప్పట్లో మా కాంగ్రెస్ ప్రభుత్వమే కోహెడలో మార్కెట్‌కు స్థలం కేటాయిస్తే, పదేళ్లు ఏం చేశారు? నియోజకవర్గ రూపురేఖలు మార్చే క్రమంలో ఫార్మా సిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తుంటే, మళ్లీ ఫార్మా తెస్తామంటున్నారు. ఇదే తీరుగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి ఉండదు. రోజూ ఇబ్రహీంపట్నం చెరువుకట్టపై నుంచి వెళ్తుంటే అభివృద్ధి కనిపించటంలేదా...? 14ఏళ్లలో నియోజకవర్గానికి మీరు తెచ్చింది, రెండున్నరేళ్ల మా రంగారెడ్డి తెచ్చిన నిధుల విషయంపై దమ్ముంటే చర్చించేందుకు రండి.

**పదేళ్లలో నియోజకవర్గాన్ని ఆగమాగం చేశారు...**

పదేళ్లలో నియోజకవర్గానికి ఎంత విధ్వంసం చేశారో ప్రజలందరికీ తెలుసు కాబట్టే 40వేల ఓట్లతో రంగారెడ్డి గారిని గెలిపించారు. మా ఎమ్మెల్యే ఇప్పటి వరకు అభివృద్ధిపైనే దృష్టిసారించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలో అండతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇక్కడి నాయకులు చేసిన అక్రమాలపై విచారణ జరిపించటంపై దృష్టి సారిస్తే ఒక్కరు కూడా బయట తిరిగే పరిస్థితి ఉండదు. ఉనికి కోసం లేనిపోని విధంగా మాట్లాడుతున్న కిషన్ రెడ్డి గారు... మీ కుటుంబంలో ఎవరికి టికెట్ వస్తుందో తేల్చుకుని వచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు గురించి మాట్లాడండి. నిత్యం ప్రజల కోసం, ఈ ప్రాంత అభివృద్ధికి తపనపడే ఎమ్మెల్యే రంగారెడ్డిపై లేనిపోని విధంగా మాట్లాడితే ఇకపై సహించేదిలేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు..

## ప్రపంచ శాంతికి యోగా మార్గం చూపుతుంది

**ప్రధాని నరేంద్ర మోదీ.**

**కోల్‌కతా,మహా:** యోగా అనేది కేవలం కొన్ని ప్రత్యేక సందర్భాలకే పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో దీనిని భాగంగా మార్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రాత్మక రెడ్ రోడ్ వేదికగా ఆదివారం ఉదయం జరిగిన భారీ బహిరంగ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వేలాది మంది యోగా సాధకులతో కలిసి ఆయన ఉత్సాహంగా వివిధ రకాల ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ.. యోగా అనేది ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత భారీ సామూహిక ఉత్సవంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. యోగా కేవలం ఒక వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యానికే పరిమితం కాదని, యావత్ ప్రపంచ శాంతికి కూడా అద్భుతమైన మార్గం చూపగలదని ఆయన స్పష్టం చేశారు.



## పోలీసుల యోగాసనాలు

- పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో యోగా డే
- యోగా ఎంతో గొప్పదన్న ఎస్పీ

**ఆదిలాబాద్ మహా:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈరోజు ఆదిలాబాద్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని పోలీసు సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది పోలీసు అధికారులు, సిబ్బంది సామూహికంగా యోగాసనాలు వేసారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపదల్లో యోగా ఒకటని, యోగా ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని ఎస్పీ తెలిపారు. నేటి యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి యోగా, వ్యాయామం, క్రీడలను దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం యోగా అధ్యాపకుల ఆధ్వర్యంలో ఆసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. సురేందర్ రావు, డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, యోగా అధ్యాపకులు పోలీసు ఏఎస్ఐ రమేష్, కానిస్టేబుల్ రాజు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నీరు పెట్టిస్తున్న ఫాదర్స్ డే దృశ్యం

- కూతురి ఉజ్వల భవిష్యత్తు కోసం పోలీసుల కాళ్లు పట్టుకుని ఏడ్చిన తండ్రి!
- గూగుల్ మ్యాప్స్ చేసిన మోసంతో ఒక్క నిమిషం ఆలస్యం.
- పరీక్ష రాసే అవకాశం కోల్పోయిన విద్యార్థులు.
- మేడ్చల్ జిల్లా కీసరలో కంటతడి పెట్టిస్తున్న హృదయ విదారక ఘటన.



**మేడ్చల్,మహా :** "నాన్న.. నా కోసం ఏమైనా చేస్తాడు" అని ఏ కూతురైనా గర్వంగా చెబుతుంది. ఆ మాటను నిజం చేస్తూ.. తన బిడ్డ భవిష్యత్తు బాగుండాలని, ఆమె కన్న కలలు చెదిరిపోకూడదని ఓ తండ్రి తన ఆత్మాభిమానాన్ని పక్కనపెట్టి పోలీసుల కాళ్లు పట్టుకుని ప్రాధేయపడిన దృశ్యం ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పిల్లలంతా తమ తండ్రులకు 'ఫాదర్స్ డే' శుభాకాంక్షలు చెబుతూ సంతోషంగా గడుపుతున్న వేళ.. ఓ తండ్రి మాత్రం తన కూతురి కోసం ఏడుస్తూ అడుక్కోవడం అత్యంత హృదయ విదారకంగా మారింది. టెక్నాలజీ చేసిన చిన్న తప్పు.. ఆ విద్యార్థిని పాలిట శాపంగా మారి, ఏడాదంతా రాత్రింబవళ్లు చదివిన కష్టాన్ని నిమిషంలో నీరుగార్చింది.మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆదివారం జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష రాసేందుకు ఉదయం ఎంతో ఆశగా ఇంటి నుంచి బయలుదేరిన పలువురు విద్యార్థులకు గూగుల్ మ్యాప్స్ రూపంలో దురదృష్టం ఎదురైంది. పరీక్షా కేంద్రాన్ని చేరుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గూగుల్ మ్యాప్స్‌ను ఆశ్రయించగా.. అది దారి తప్పించి వారిని మరో ప్రాంతానికి తీసుకువెళ్లింది. అడ్రస్ తప్పు అని తెలుసుకుని, ఆదుర్దాగా అసలు కేంద్రానికి చేరుకునే సరికి కేవలం ఒక్క నిమిషం ఆలస్యమైంది. అప్పటికే ప్రధాన ద్వారం మూసివేసిన పోలీసులు.. నిబంధనల ప్రకారం ఒక్క నిమిషం లేటైనా ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించేది లేదని కరాఖండిగా తేల్చి చెప్పారు.కళ్ల ముందు పరీక్షా కేంద్రం కనిపిస్తున్నా లోపలికి వెళ్లలేని నిస్సహాయత ఆ విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఒక్క నిమిషం ఆలస్యంతో తన బిడ్డ జీవితం ఎక్కడ నాశనమైపోతుందోనని అక్కడున్న ఓ తండ్రి గుండె ఆగిపోయినంత పనైంది. "అయ్యా.. కావాలని ఆలస్యంగా రాలేదు. గూగుల్ మ్యాప్స్ తప్పు చూపించడం వల్లే దారితప్పాం. ఏడాది పాటు నా బిడ్డ రాత్రింబవళ్లు కష్టపడి చదివింది. ఒక్క నిమిషమే కదా సార్.. దయచేసి లోపలికి పంపండి. నా బిడ్డ భవిష్యత్తు నాశనం చేయకండి.. మీకు పుణ్యం ఉంటుంది" అంటూ ఆ తండ్రి అక్కడున్న పోలీసుల కాళ్లు పట్టుకుని, వారి పాదాలపై పడి బోరున విలపించాడు. కన్న తండ్రి పడుతున్న ఆ వేదన చూసి ఆ కూతురు సైతం కన్నీరుమున్నీరుగా రోదించింది.గత కొద్ది రోజులుగా నిద్రలేకుండా చదివిన చదువు, కన్నవారి ఆశలు కళ్ల ముందే కాలిపోతుంటే ఆ తల్లిదండ్రులు, విద్యార్థులు గుండెలు పగిలేలా ఏడ్చారు. ఎంత ప్రాధేయపడినా, సాష్టాంగ నమస్కారాలు చేసినా నిబంధనలు అడ్డు రావడంతో పోలీసులు కఠినంగానే వ్యవహరించారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను లోపలికి పంపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పడంతో.. ఆశలన్నీ ఆవిరైపోయి, కన్నీటితో వెనుదిరిగారు. 'ఫాదర్స్ డే' నాడు ఓ తండ్రి తన బిడ్డ ఉజ్వల భవిష్యత్తు కోసం తన ఆత్మాభిమానాన్ని సైతం వదులుకుని రోడ్డుపై పోలీసుల కాళ్లపై పడిన ఈ హృదయ విదారక దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరి గుండెను బరువెక్కేలా చేసింది.

# నైపుణ్యశీలి వీరయ్య మేస్త్రి.. పల్లె నుంచి పట్నం వరకు పునాదిరాళ్లు

**నేడు సంస్మరణ సభ**

కారేపల్లి, మహా: కారేపల్లి మండలంలో ఆధునిక భవన నిర్మాణం అంటే గుర్తుకు వచ్చే పేరు చిత్తలూరి వీరయ్య (వీరయ్య మేస్త్రి). శ్రమను నమ్ముకున్న ఆయన జీవితం పల్లె నుంచి పట్నం వరకు విస్తరించి, భవన నిర్మాణ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. శ్రమజీవులకు ఇచ్చే గౌరవం, నాణ్యతపై రాజీ పడని తత్వం ఆయన విజయానికి పునాది వేసింది. అన్ని హంగులతో, ఆధునిక వాస్తు ప్రమాణాలకు అనుగుణంగా భవన నిర్మాణం చేయడంలో ఆయన దిట్టగా పేరుపొందారు. చెప్పిన సమయానికి, అంచనా బడ్జెట్ దాటకుండా పనులు పూర్తి చేయడంతో గృహ యజమానుల నమ్మకాన్ని చూరగొన్నారు.

మస్తాన్ మేస్త్రి శిష్యుడిగా నిర్మాణ రంగంలో అడుగు పెట్టిన వీరయ్య, కాలక్రమంలో గురువును మించిన శిష్యుడిగా గుర్తింపు పొందారు.

**పల్లె నుంచి పట్టణం వరకు పునాది రాళ్లు**

కారేపల్లి మండలంతో పాటు ఖమ్మం పట్టణంలోనూ అనేక ఆధునిక భవనాలకు ఆయన నిర్మాణ సారథ్యం వహించారు. ఇల్లు నిర్మించుకోవాలంటే వీరయ్య మేస్త్రినే సంప్రదించాలనే నమ్మకం ప్రజల్లో బలపడింది. తన కింద పనిచేసే కార్మికుల పట్ల ఆప్యాయత చూపుతూ వారి అవసరాలను తీర్చడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. దీంతో భవన యజమానులు, కార్మికుల్లో ఆయనకు అపారమైన అభిమానాన్ని సంపాదించుకున్నారు.వామపక్ష ప్రజాతంత్ర భావాలతో విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన వీరయ్య మేస్త్రి, సింగరేణి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నేతగా కూడా సేవలందించారు. కార్మికుల సంక్షేమ బోర్డు ప్రయోజనాలు అందేలా కృషి చేయడంతో పాటు, నిర్మాణ రంగంలో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేశారు. ప్రస్తుతం సంఘం గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతూ ఉద్యమాన్ని విస్తరించేందుకు కృషి చేశారు.

ఇటీవల ఖమ్మంలో పనులు ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరయ్య మేస్త్రి, నెలరోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి కన్నుమూశారు. ఆయన మృతితో కారేపల్లి కార్మిక లోకం శోకసంద్రంగా మారింది. అంతిమయాత్రకు వందలాది మంది కార్మికులు, ప్రజలు తరలివచ్చి కన్నీటి నివాళులు అర్పించారు. ఏ రాజకీయ నేతకీ లభించని గౌరవాన్ని ఆయన తన సేవల ద్వారా సంపాదించారని స్థానికులు భావోద్వేగంగా గుర్తుచేసుకుంటున్నారు.

**నేడు సంస్మరణ సభ**

వీరయ్య మేస్త్రి సంస్మరణ సభను సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కారేపల్లి క్రాస్ రోడ్ వద్ద ఆయన స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేలోత్ రవి, శనగ రాంబాబు, సీఐటీయూ గౌరవ అధ్యక్షులు ముక్కా సీతారాములు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 22-06-2026



# అట్టా చినిగిపోయింది..!

ఎప్పుడూ... నా చేతిలో తచ్చాడే
పుస్తకం అట్టా చినిగిపోయింది...
జ్ఞానజ్యోతి కిటికీ నుండి జాలువారిన
జడివాన తుంపరులకు తడిసినట్టుంది...
నా అశ్రద్ధ వుందో..లేదో తెలియదు గానీ..
మనిషికి వస్త్రమెలా మర్యాదా మండపమో
పుస్తకానికి అట్టా అలాంటి ఆత్మీయ ఆవరణమే

అది కాగితపు పొర కాదు
కాలపు కరచాలనాన్ని కాపాడే కవచకుండలం
అక్షరాల అంగరంగ వైభవానికి
అట్టా ఓ ఆహ్వాన తోరణం
పుటల ప్రాణవాయువును పొదివిపట్టే
నిఖార్సయిన సంరక్షక సైనికుడు అది

అట్టా చినిగిన పుస్తకం కనిపిస్తుంటే...
పక్షి రెక్క విరిగిన బాధ గుండెను గుచ్చుతుంది
వర్షానికి తడిసిన గూటిలా....
వాడిపోయిన పూలహారంలా కనిపిస్తుంది

జ్ఞాపకాల జరీ అంచులు ఊడిపోతే
మనసు మెల్లగా ముడుచుకున్న ఆకులా
మారుతుంది..... నిజం సుమా...
ఎన్నో రాత్రుల వెలుగును దాచుకున్న
అక్షర గర్భగుడికి అది గోపుర ద్వారంలా ఉండేది

పుస్తకాన్ని ప్రేమిస్తున్న నా కళ్ళు
ఆ కాగితపు గాయాలపై కన్నీటి లేపనం రాస్తుంది
అట్టా చినిగిందంటే...కేవలం అట్టే కాదు...
చదివిన రోజుల చిగురుటాకుల జ్ఞాపకాలు
అది నాతో పంచుకున్న చెలిమి ఊసులు
కొంచెం కొంచెంగా చిరిగినట్టే....
పుస్తకం ఒక దిక్సూచి
మనిషి మేధోమహాసముద్రానికి నావికచుక్క
అట్టా దాని పడవ తెర
పుటలు దాని ప్రయాణ పటాలు..
నిట్టూర్పుల నదిలా

అట్టను ఆదరించడం అంటే...!?
అక్షరాలను కాదు....భవిష్యత్తును ఆలింగనం చేసుకోవడం.
చినిగిన అట్టను కుట్టగలం
చిరిగిపోతున్న జ్ఞానసంబంధాన్ని కాదు....

కంప్యూటర్ స్క్రీన్ పై వాలిన
వేల వేల కళ్ళను చూస్తూ..
పుస్తకం ఇప్పుడు నిజంగానే వివస్త్రగా కనిపిస్తోంది
నేను ఓ వార్తా పత్రికను దానిపై కప్పి పోతున్నా..!



డా.రమేష్ కటుకోర్ర్వుల
సెల్:9949083327

కథ

# జడ్డెన్న ఆకలి

బమ్మిడి దేవీ ప్రసాద్



మా జడ్డెన్న కథ ఎలా చెప్పాలి? ఎలా మొదలు పెట్టాలి? మా లక్ష్మీ పురంలో జడ్డెన్నని తెలీని వారుండరు. పెళ్లి విందులోనైనా, చావు భోజీ లోనైనా వాడుండాల్సిందే. వాడికి కడుపునిండా భోజనం పెట్టి, వాడు తృప్తి గా తిని లేవందే – ఆ భోజనాలకి సార్థకత లేదనిపించేది. అలాగని అందరూ వాడికి అంత చక్కగా తిండి పెట్టేవారని నేననలేను. కొంతమందయితే, 'ఒరే! కాస్త అటుండరా అందరి భోజనా లైనంతవరకూ!' అని కసురుకునే వారూ వున్నారు. మరికొంతమంది, పంక్తి కి దూరంగా వాడికోక విస్తరి వేసి భోజనం వడ్డించేసిన వారూ వున్నారు. బమ్మిడి జడ్డెన్నకి ఆకలెక్కువ. ఒక్క సారి కూర్చుంటే, ముగ్గురి నలుగురి భోజనం లాగించేసే వాడు. అది జబ్బేమో అని డాక్టర్లకి చూపించేరు. మందులూ వాడేరట. గుణం కనపడలేదట.

జడ్డెన్న వాళ్ళది మూడెకరాల చిన్న రైతు కుటుంబం. మా ఇంటికి, గోర్జీ వైపు ఐదిళ్ళు దాటించిన తరువాత వాళ్ల పాక వుండేది. జడ్డెన్న వాళ్ల నాన్న చిన్నప్పుడే చనిపోయేడు. జడ్డెన్నకి ఒక అన్న వుండేవాడు. ఆ కుటుంబం ముగ్గురూ ఆ మూడెకారాల వ్యవసాయం మీద బ్రతకాలి.

జడ్డెన్నని మొదటిసారి చూసింది వాళ్ళింటి అరుగు మీద. వాడికప్పుడికి ఇరవై ఏళ్ళుంటాయి. నేను బ్రాహ్మణతర్లా స్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న.

గెడ కర్రల్లాంటి కాళ్ళూ, చేతులూ, తెల్లగా పాలిపోయిన కళ్ళూ, పెద్ద పెదిమలు, సగం గుండు ఐపోయిన తలా -పంచెకట్టుకుని, భుజం మీద తువ్వాలు తో, కుడి కాలు మడిచి గెడ్డాని కానించి, యోగి వేమన పోజులో వాళ్ళరుగు మీద కూర్చుని కనపడ్డాడు. జడ్డెన్న గురించి అప్పటికే మా నాన్నమ్మని అడిగి వున్నాను. ఆమె మాటల్లో –

'ఆళ్లు మన చూట్టాలేన్రా! మీ ముత్తాతకి వాళ్ల ముత్తాత అన్నదమ్ముడు. అందుకనే మన వాసలో వున్నారు. ఆళ్ళు పేదోళ్ళు. ఆడికంత తిండెట్టడమూ కష్టమే. పోనీ, పొలాని కెళ్ళి కష్టమైనా పడతాడా అంటే వెళ్లడు. అలాగే ఆ అరుగుమీద కూకునుంటాడు. లేకపోతే, వూర్లో ఆ వీధీ, ఈ వీధీ తిరుగుతుంటాడు.'

నేనోసారి జడ్డెన్న వాళ్ళింటి ముందునుంచి వెళుతుంటే, వాళ్ళమ్మ అక్కడ నుంచోనుంది. నన్ను చూసి జడ్డెన్న, 'ఒరే తమ్ముడూ! బాగున్నావా?' అన్నాడు. వాళ్ళమ్మ నన్ను చూసి, 'జడ్డెన్న మీ అన్నేన్రా' అంది.

2

అప్పుడు, వాడేదో నాకు దగ్గిరి చుట్టంలా, చాలా కావాల్సిన వాడిలా అనిపించేడు. అప్పటికే వాడి గురించి కథలు వినున్నాను – అక్కడక్కడా కొంచం నవ్వు పుట్టించిన సంఘటనలు దొర్లినా, ఆ కథల్లో బహు విషాదం వుంది.

'మా అన్నే ఇలా వుండి ఉంటే ఏం చేసుందుము?' అని అనిపించింది.

ఏమనుకుందో ఏమో, వాళ్ళమ్మ నన్ను చూస్తో – 'ఈడికి తిండి పెట్టలేక సచ్చి పోతన్నాన్రా అయ్య' అనేసింది.

జడ్డెన్న నా ముఖం వంక చూసి – 'ఆకలి ఆపుకోలేక పోతన్నాన్రా! ఎంత తిన్నా నా కాకలి సావదు. నేనేం చేయ్యాల్రా తమ్ముడూ?' అన్నాడు.

'నిజమే, వాడి చేతుల్లో లేని బాధని వాడెలా తీసేసి కోగలడు' అనుకున్న.

'నా మూడెకరాల ఫలసాయమూ ఈడి మేతకే సరిపోతంది' అని దులుపుకుని పశువుల సాలలోకి వెళ్లిపోయిందాయమ్మ.

నేను కొంతసేపు అక్కడ నిలబడి, మా ఇంటి వేపు నడిచేను.

వూళ్ళో పెళ్ళిళ్ళు, చావులూ అయితే వాడి తిండికి లోటుండదు. వూరంతా ఒకే కులం అవడం వల్ల వాడినెవరూ 'ఫో' అనేవారు కాదు. కానీ, అవి కాక మరే ముంటాయి అవకాశాలు, మా వూరు లాంటి చిన్న వూళ్ళల్లో. ఆ మిగతా రోజుల్లోన, ఎవరో ఒకరు ఇంతో అంతో అన్నం పెట్టే వారు. కానీ ఎవరూ వాడిని కూచోబెట్టి భోజనం పెట్టే సాహసం చేయ లేకపోయే వారు. అంత తిట్టినా తల్లీ, అన్నదమ్ముడూ వాడిని వున్నంతలో బాగానే చూసుకునే వారని నాన్నమ్మ చెప్పేది.

నేను వేసవి శలవలకి హరిపురం వచ్చినప్పుడు, జడ్డెన్న అన్నకి పెళ్లయిందని తెలిసింది. 'ఆ ఇంట్లో ఇపుడు నాలుగు నోళ్ళన్నమాట తినడానికి' అనుకున్నాను.

శలవలైపోయి లక్ష్మీ పురం వచ్చేశాను. ఇపుడు తర్లా స్కూల్లో నేను పదో తరగతికి వచ్చేను.

లక్ష్మీ పురం నుండి బ్రాహ్మణతర్లా కి పోయే దారి – ఓ వెడల్పైన చెరువు గట్టు. దానికి ఎడమ వైపు పచ్చని వరి పొలాలు, కుడి వైపు పెద్ద చెరువు. ఆ చెరువుకి ఎగువన, గట్టు చివర – యేరు. ఆ యేరు దాటితే తర్లా వస్తుంది. ఆ ఏటికీ, మా పెద్ద చెరువుకీ మధ్య బ్రాహ్మణ తర్లా గ్రామ శ్మశానం వుండేది.

అక్కడన్నీ సమాధులూ, శవం కాల్చిన బూడిద గుర్తులతో స్థలాలూ, అక్కడక్కడా బొమికలూ, చిన్న పుర్రెలూ వుండేవి. మావేపు చిన్న పిల్లల్ని చనిపోతే కాల్చరు. పాతి పెడతారు. నక్కలు, కుక్కలు వచ్చి కొన్ని పిల్లల శవాల్ని బయటికి లాగేస్తాయి. ఆ చిన్న పుర్రెలు అటువంటి శవాలవి.

3

మాలో కొంతమందిమి, చెరువు గట్టు మీంచి కాకుండా, అపుడపుడూ అడ్డంగా ఆ శ్మశానంలో పడి లక్ష్మీపురానికి నడిచి వచ్చే వాళ్ళం. అట్లాంటి వాళ్ళం మాలో కొద్దిమందే వుండే వారు. కొన్ని సార్లు కొంచం భయం వేసినా, దాన్ని అధిగమించి అలా నడిచి రావడం మాకో కిక్కిచ్చేది. దెయ్యాలు పట్టుకుంటాయని, అది దగ్గరి దారైనా చాలామంది ఆ దార్లో వచ్చే వారే కాదు.

ఆ దార్లో తరచూ మాకు పాములూ, ముంగిసలూ కనపడేవి. ఓసారయితే, ముంగిస పాము ఫైట్ నిజంది చూశాం. కొంత సేపయినాక, పాము బాధ చూడలేక మా అప్పలస్వామి ముంగిసని తరిమేశాడు. గాయమైన మూతితో, రక్తం ఓడుతూ ఆ పాము పొదల్లోకి అదృశ్యమైపోయింది.

ఆ రోజు మధ్యాహ్నమే స్కూలు వదిలేసేరు. నాతో వొచ్చేవారు ఎవరూ లేకపోతే, నేనొక్కడినే శ్మశానం దారి పట్టేను. అలా నడుచుకుంటూ, శ్మశానం మధ్యకి వచ్చేను. దూరంగా కుక్కలు అరుస్తునాయి.

ఆ క్రితం రోజు బ్రాహ్మణ తర్లా లో ఒకటో రెండో చావులైనట్లున్నాయి.

అది పెద్ద ఊరవడం వల్ల ఆపుడపుడూ ఆ వూళ్ళో ఒకేసారి రెండు మూడు చావులు సంభవిస్తుంటాయి. కాష్టం కాలడం పూర్తయినాక, ఆ బూడిదని ఒక కుప్పలా పోగు పెట్టి, రెండోరోజు అక్కడ పూజ చేసి వాయినాలు అంటే చనిపోయినవారికి భోజనాలు పెడతారు. ఆ వాయినాల్లో, చనిపోయిన వారికి ఇష్టమైన వంటకాలు పెడతారు. అందులో గారెలు, బూరెలు, అరిసెలు కూడా వుంటాయి. దూరంగా అలాంటి పూజల గుర్తులు కనపడుతున్నాయి.

మరింత దూరంగా, సమాధులకి అవతల ఏదో కదలిక కనపడింది.

'ఏమయుంటది? దయ్యమా? ఈ మిట్ట మధ్యాహ్నం దయ్యాలేమిటి?' అనుకున్న.

గబ గబా ఆ సమాధుల వైపు వెళ్ళేను. నా నడక చప్పుడు విని ఆ సమాధి వెనక్కి ఎవరో జరిగి పోతున్నారు. ఇంకా ముందుకెళ్ళి చూసేను.

జడ్డెన్న!!!

చేతిలో విస్తారాకులో అన్నంతో. వాడిముందు మరో రెండు విస్తళ్ళు పూర్తి భోజనం తో వున్నాయి. దగ్గరికి వస్తున్న కుక్కల్ని అదమాయించడానికి చేతిలో కర్ర వుంది. వాడి జీవం లేని తెల్లటి కళ్ళ తో నావైపు తలెత్తి చూశాడు.

ఓ మూడు క్షణాలు నేను స్థాణువు నై పోయేను.


'ఒరే తమ్ముడూ, వూర్లో ఎవరికీ చెప్పకు రా!' అన్నాడు.

'జడ్డెన్నా! ఎందుకిలగ ఐపోయేవు రా!' అని, కళ్ళ నీళ్ళు ఆపుకుంటో ఆ సమాధి మీద కూచుండి పోయా.

4

కొంత సేపయినాక, 'ఎవరికీ చెప్పన్లే' అని కళ్ళతోనే సౌంజ్ఞ చేసేసి, వూరివేపు నడిచా మనసులో పొగులుకుంటూ.

# ప్రజ్వలిస్తున్న 'తంపి' కవిత్వం ప్రజలదే!




In the midst of winter, I
finally learned that within me there lay an invincible summer Albert Camus

ప్రపంచమంతా ప్రజాస్వామ్యం, శాంతి, అభివృద్ధి,అస్తిత్వాల ముసుగుల్లో వాణిజ్యం రాచరికపు యుద్ధాలకు, దాడులకు పాల్పడుతున్నది. ఇప్పుడు అంతటా అలుముకున్నది నిర్బంధపు శీతాకాలమే. కాలం మంచుగా గడ్డకట్టుకు పోయి, మనుషులు తమలో తాము ముడుచుకు పోయి, వణికిపోతున్న పరిస్థితి. ఇటువంటి సమయంలో చైతన్యం కలిగి ప్రజలు ఎవరికి వారు తమలోనే అగ్గిని రాజేసుకోవడం ఒక్కటే ముందున్న ప్రత్యామ్నాయం. కవి శ్రీరామోజు హరగోపాల్ అదే మార్గంలో నడుస్తున్నారని, తనచుట్టూ ఉన్న సమాజాన్ని కవిగా నడుపాలనే ఆశతో ఉన్నారని నిరూపిస్తున్నదే ఈ 'తంపి' కవిత్వం.

కవి హరగోపాల్ ఆల్బర్ట్ కామూ వేసవిని తనలో రగిలించుకున్నట్లుగా,
తన లోపల తంపిని
పెట్టుకున్నారు. అంతటితో ఊరుకోలే. దాని నుంచి పట్టాలు తెచ్చి సమాజపుబండి కూలిపోకుండా ఎక్కించడానికి పూనుకున్నారు. అదే తన కవిత్వంగా ఈ కావ్యం మొదట్లోనే చెప్పుకున్నారు.

హరగోపాల్ ఎప్పుడో మనసును కవిత్వానికి, మేధస్సును చరిత్రకు కట్టేశారు. చరిత్ర అన్వేషణలో వెనకటి కాలానికి రికామి లేకుండ..'జాతిని మోసుకు తిరుగుతూ,' కవిగా నిరంతరం కవిత్వపు వానలో తడుస్తూ ముందుకు సాగుతున్నారు. రెండు పాత్రల సగటుగా ఉన్న చోటనే ఉండిపోక, తాను నడుస్తూ సమాజానికి సరైన మార్గనిర్దేశం చేస్తున్నారు.

ఇప్పటిదా ఆయన జీవిత ప్రవాహం ఆలేరులో షురువయింది.
మట్టిపొత్తిళ్లు, మూలకం, పాడాలని, చెలిమెలు, కొండపొదుగుపాలు, ఇలా ఎన్నో స్వీయకావ్యాలతో గత నాలుగు దశాబ్దులుగా కొత్తగా మలుపులు తిరుగుతూ సాగిపోతున్నా.., 'తంపి'లో పాత సంపుటుల ప్రసక్తితేని, తన 'చరిత్ర'ను చాటుకోవటం పట్ల విముఖత కలిగిన వారు హరగోపాల్.

ఇక ప్రస్తుతానికొస్తే 'తంపి' ఈ రెండక్షరాల తెలంగాణ పలుకు కవివ్యక్తిత్వానికి, పుట్టిన కులవృత్తికి, పట్టిన కలం ప్రవృత్తికి సరిపోయే మాట. ఎప్పుడూ లోపల రగులుతుండే చైతన్యం 'తంపి'. కణకణలాడే పిడకలపేర్పు దాలిగుంట అది. ఈ తంపిలో ఇనుమును ఎర్రగ కాల్చి కొంచెం మెత్తబడగానే బండి గీరెలు కూలకుండా తొడుగడం కమ్మరుల పని.

ఈ 'తంపి'లో 2017 నుంచి 2025 దాక రాసిన 81కవితలున్నాయి. ఏ కవితలోను నిలబడలేక కూలిపోయే నైరాశ్యం కనిపించదు. చాలా కవితల ఎత్తుగడలో నిరాశ, బాధ, సమస్య, ఇలా ఏదో 'ఊరికే ఒలికే కన్నీళ్లు'గా నైరాశ్యాన్ని మోస్తూ కనిపించినా, నిర్మాణ సంబంధమైన నానా మలుపులు తిరిగి చివరికొచ్చేసరికి 'రేపంటే ఆనందమనే ఆశ వొదలలే' మాదిరి ఆశావహంగానే స్వస్తి పలుకుతాయి.

'తంపి' వస్తుపరంగా మనుషుల వైపు నిలిచి మాట్లాడుతున్న కవిత్వం. రైతులు, పోరాట వీరులు, స్త్రీలు, గిరిజనులు, అడవి, ప్రకృతి, ఇలా ధ్వంస మౌతున్న, కొల్లగొట్టబడుతున్న అణచివేతలకు అఘాయిత్యాలకు గురౌతున్న వారిని, వాటినే తన కవిత్వ భూమికగా చేసుకుని రాజకీయనాయకులను, నానా వ్యవస్థలను, రాజ్యాన్ని, దురహంకారాన్ని, మత మౌఢ్యాన్ని, కులజాడ్యాన్ని ప్రశ్నిస్తున్న కవిత్వమే 'తంపి'లో కణకణలాడుతున్నది. జాతీయంగా, అంతర్జాతీయంగా జరుగుతున్న మానవ హననాన్ని దౌర్జన్యాన్ని ప్రశ్నిస్తున్న కవిత్వమూ ఉంది.

బాల్యాన్ని, మిత్రులను, ఇంటిని, ఊరును యాది చేసుకునే కవితలు చాలానే ఉన్నాయి. ఆ సందర్భాల్లో నాస్టాల్జియాగా అనిపించినా, మనిషిని మనిషిగా మననీయని పరిస్థితులకు, బంధాలన్నీ కూలుతూ ఎవరిబతుకు వారిదే అవుతున్న వైఖరులకు విసిగిపోయినందుకే, వాటిని నిరసిస్తూనే రాశాడే తప్ప; "గతకాలము మేలు.." ధోరణిలో పడని కవిత్వమిది. అలాగే కరోనా సమయంలో నగరాల్లో, పట్నాల్లో బతుకు తెరువు మూసుకుపోయి వలస కూలీలు , కార్మికులు తమతమ సొంత స్థలాలకు కాలినడకన పోతున్న సందర్భంలో 'పాదాలే దేశాన్ని మోస్తున్నాయి' అన్న కవితను, ఢిల్లీ రైతు ఉద్యమ సందర్భంలో రైతుకు నైతిక మద్దతుగా నిల్చే కవిత్వాన్ని రచించారు.

అందరు కవుల్లా కాకుండా హరగోపాల్ గారు ఏ కవితను ఇలాగే రాయాలని ఒక నిర్దిష్టమైన వ్యూహం ముందే నిర్ణయించుకుని రాసినట్లుగా ఉండదు. "నిరుపహతి స్థలంబు" స్థాయిలో తూగుటుయ్యలపై కాకున్నా ఆసాలపీట వేసుకు కూచుని రాసిన కవిత్వమూ కాదిది. వచన కవిత్వంలో సాధారణంగా కనిపించే ఎత్తుగడతో పాఠకుడిలో
ఒక ఉత్సుకతను రేకెత్తించేలా మొదలు పెట్టడం, అలా వాక్యంపై వాక్యాన్ని పకడ్బందీగా అల్లుతూ ఆకట్టుకోవాలనే తాపత్రయమూ నాకైతే ఏ కవితలోను కనిపించలేదు. అన్ని కవితలూ అలా అలవోకగా నీళ్లు పారినట్లుగా కవి భావాల పల్లవాలకే దారిపట్టి ప్రవహిస్తూనో, కన్నీళ్ళు కారినట్లుగా మనసు నుంచి పెల్లుబికి రావడమో తప్ప పనిగట్టుకుని శిల్పీకరించిన వైనం ఈ కవిలో కనిపించదు.
అది ఈ కవి రచనాశైలి ప్రత్యేకతనే కాకుండా, నిరంతర సాధన వల్ల గడించిన పరిణతిగా కూడా భావించవచ్చు.

వాక్యాల్లో అలవోకగా వ్యక్త మయ్యే ప్రాస, శబ్దాలంకార గుణం, తెలంగాణ మాటల పూర్ణానుస్వార లక్షణం, జానుతెనుగు భాషా సహజ సౌందర్యం ఇవి వాక్యాలకు మన మనసులను ముడేసి మరీ గుంజుకి పోతుంటయి. రాస్తున్నప్పుడు కవి కలం ఆగనట్టే, చదూతున్నప్పుడు, మనకండ్లు నిలుచోవు. చూపులు ఆ అక్షరాల ప్రవాహంలోపడి కొట్టుకు పోతుంటయి. కవి ఆవేశం, ఉద్వేగం ఆగని ఆ అక్షరాల ఉరవడిలో ద్యోతకమవుతుంది. పాఠకుడిలో
నిలుచోని ఒక వాక్యాన్ని పట్టిచూసే సమయం ఇవ్వడు కవి. అందుకే కాబోలు హరగోపాల్ గారి ఈ శైలీ వైలక్షణ్యమే ఇంతగా విస్తృత కవిత్వం రాయడానికి కారణమై ఉంటుంది.

ఈ కవిత్వంలో ఎక్కడా పనిగట్టుకు అల్లిన అర్థాలంకారాలు కనిపించవు. సహజంగా, అలవోకగా తప్ప పనికిమాలిన సిమిలీల చిలుము, తోకెంబడి రూపకాల జోలీ కనిపించవు. ఇట్లా కవిత్వాన్ని తెలంగాణ బహుజన భాష,యాసలకు అబ్బిన సజీవ అలంకారాలలో రాస్తాడే తప్ప కవి ఎక్కడా అస్పష్టపు గోడల్లోనో, సంక్లిష్టపు పొదలలోనో దాక్కోడు. తాను ఉద్దేశించిన వాళ్లకు చేరాలంటే తన కవిత్వ మార్గం ఎట్లా ఉండాలో, తెలిసిన కవి హరగోపాల్.

అలవోకగా, చెప్పదలచుకున్న భావాల ప్రవాహంలా కవిత సాగిపోవాలంటే ప్రధాన పాత్రగా 'భాష'నే నిలుస్తుంది. అందుకే కవి తనదైన వాచకాన్నే కవిత్వానికి వాహికగా ఎన్నుకున్నారు.

తెలంగాణ భాషలో రాయడం సాధారణమే అయిపోయినా కవి..
'జట్టన పోయి', 'జోటవిడువని దోస్తులు', జర్రంత, సాయితా! (నామ సంబోధన) ఇలా తనదైన ఉచ్చారణకు పెద్దపీటవేస్తుంటారు.

ప్రవాహపు ఉరవడిలో.. ఉర్దూ,ఇంగ్లీషు వాక్యాలకు వాక్యాలు వెనక్కి తిరిగి చూడకుండా వాడడం హరగోపాల్ గారి శైలీ వైవిధ్యం.

ఇంగ్లీషు అనివార్యమైన స్థితిలో మనమున్నాం. ఆ మాటలను వాడకూడదని, ప్రత్యామ్నాయపు తెలుగు మాటలను మాత్రమే వాడాలని మడికట్టుకు కూర్చుంటే సహజత్వం దెబ్బతినే స్థాయికి చేరాం. అందుకేనేమో కవి హరగోపాల్ కొన్ని కవితల్లో ఇంగ్లీషు వాక్యాలనే ఉపయోగించారు.

'జిందగీ ఏక్ క్వాబ్ నహీ',
'యాదోంకి దాస్తా హై/క్వాబోంకి మేలాహై',
'దో బూంద్ ఆంసూ..' ఇలా సందర్భశుద్ధిగా వాడిన ఉర్దూ షేర్లు, వాక్యాలు, వాటి మార్దవం వల్ల హాయిని పంచుతాయి.

హరగోపాల్ గారి 'తంపి' కావ్య స్వారస్యాన్ని ఒక కవితను మాస్‌లాగా చూపి తెలిపే ప్రయత్నం చేస్తాను.

**నిట్టాడు**

దిగులు దీపాల్ని ముట్టించి దీగూట్ల పెట్టి
కడపకు తలవెట్టి పడుకున్న ఏడ నీ అడుగులసప్పుడు?
మోసపోయిన మబ్బుల్ని బుదగరిస్తున్న మొగులు వెన్నెలకప్పి జోకొట్టింది
వాకిట్ల పొగడపూలచెట్టు ఎంతనిక్కి చూసినా పూలు రాలిన యిగని
పసులెనుక నీ పాట రానేలేదు
పక్క పరిచిన గడెమంచం దినాలసంది రంధి పడ్తన్నది
నీ చెయ్యిమెత్త చేస్కుని కన్నీళ్ళల్ల తడిసిందా?
ఏడున్నవో నువ్వు దేశంలున్నవో, పరదేశంలున్నవో ఏడ తుపాకిసప్పుడైనా బుగులైతది
సాగనంపిన కండ్లు పొడుచుకున్న పుండ్లయినయి
ఊపిరి కట్టెబారకముందె వస్తవుగద
సగం చింపిన రొట్టె ఆడనె మనసు నిండనిది కడుపునిండుతదా?
మనాది కుంపటిలెక్కున్నది
ఇల్లు, వాకిలి, పూలచెట్లు, అన్నంకుండ, నేను గోగుపూలై పూసినం ఇగనన్న వస్తవ...
ముచ్చట బొండిగెలున్నది
పొద్దు దండెంమీద ఎండిపోతున్నది ఎదురుచూడని వానవై కురుస్తవా?

గుడిసెకు ఆధారం 'నిట్టాడు'. ఈ కవిత ఇంటిపెద్ద మగడు లేక, రాక ఎదురుచూస్తున్న ఇల్లాలి పలుకుగా సాగింది.
ప్రతి వాక్యంలోను మనసును తాకే దృశ్యాలతో
దిగులు దీపాలను కళ్లకు, మోసపోయిన మబ్బుల్ని పిల్లలకు, ఇలా చక్కటి,చిక్కటి ప్రతీకలతో సాగింది కవిత.

నిక్కి చూడడం, పూలురాలడంలలో కవి పరిశీలనా నైశిత్యం, 'నీ చెయ్యి మెత్త చేస్కుని' లో మెత్తను చెయ్యిగా భావించడమనే రూపకమే కాదు, ఆ చేతికి తల ఆనించి గోడును వ్యక్తంచేసుకునే తీరులో అది కన్నీటితో తడిసిపోవడాన్ని మాటల్లో బొమ్మకట్టి చెప్పే నేర్పు వెల్లడవుతాయి.
"సాగనంపిన కండ్లు
పొడుచుకున్న పుండ్లయినయి"
తప్పుచేసినానా అని మధనపడే ఆ దృశ్య 'రూపకం' లో కండ్లు పుండ్లయి ఏడ్చీఏడ్చీ ఎర్రబడ్డయి.
"సగం చింపిన రొట్టె" తన మరోసగం తిన్నాడో లేదోననే బాధకు ప్రతీక. తాను తిన్నా మనసులోని వెలతి పూడ్చలేనిదైన తీరును చెప్పక చెప్పే వాక్యం.
"గోగుపూలు" గా ఎర్రబడ్డ ఎదురుచూపులు.
చివరలో కవి మన కళ్ల నుంచి కన్నీరు వానగా కురియ జేసే వాక్యాలతో కవితను ముగిస్తాడు.

పొద్దుదండాన్ని పట్టుకుని విడువక వేళాడుతున్న సందర్భంలో ఉన్నాం.ఈ వేళ 'తంపి' బొండిగెలో కవిత్వపు ముచ్చట తెలుసుకునేందుకు మీరంతా ఎదురుచూడని వానగా కురిసి పోవాలన్నదే నా ప్రగాఢమైన ఆకాంక్ష కూడా.

మడిపల్లి రాజ్‌కుమార్
9949 699 215

# బహుభాషా వేత్త డాక్టర్ నలిమెల భాస్కర్

## పరిశోధనా పుస్తకాల ఆవిష్కరణ -పురస్కార ప్రధాన సభ

డాక్టర్ నలిమెల భాస్కర్ పరిశోధనా పుస్తకాలు
1.తెలుగులో సామెతలు ద్రావిడ భాషల్లో తులనాత్మక పరిశోధన (ఎం. ఫిల్ )
2. తెలుగు, మలయాళ సామెతల కుటుంబ జీవన చిత్రము (పి. హెచ్. డి)
ఆవిష్కరణ మరియుప్రముఖ కవి అన్నవరం దేవేందర్ కు నలిమెల బుచ్చమ్మ రామచంద్రం స్మారక తొలి పురస్కార ప్రదానం సమావేశము తేదీ 28. 6.2026 ఉదయం 10గంటలకు కరీంనగర్ లోని ఫిలిం భవన్ లో కలదు. ముఖ్య అతిథి ఆవిష్కర్త ఆచార్య ఎన్ గోపి. ఆచార్య ఎస్ రఘు ,గాజోజు నాగభూషణం, బూర్ల వెంకటేశ్వర్లు, రవి ఠాకూర్ పాల్గొంటారు. నగునూరి శేఖర్ అధ్యక్షత వహిస్తారు.

--సాహితీ సోపతి

## దృశ్యం మారింది!

రాత్రి కురిసిన వాన
గాలి గుఱ్ఱమెక్కి వచ్చింది!

దెయ్యం పట్టిన చెట్లు
జుట్లు విరబోసుకుని వీరంగం!

జడుసుకున్న కరెంటు తీగ
అకస్మాత్తుగా చేతులెత్తేసింది!

నేల తన ఏడాది దాహాన్ని
రాత్రంతా దోసిలి పట్టి తీర్చుకుంటున్నది!

వరద పాలైన ఆరబోసిన ధాన్యం
తెలంగాణ రైతు దుఃఖానికి పరాకాష్ట!

తన దగ్గర ఏ పాత్ర లేకున్నా ఆకాశం
అన్ని టీఎంసీల నీళ్లు ఎలా దాచుకుందో!

వర్షం చాచి కొట్టిన చెంప దెబ్బకు
ఎండ చిరునామాను కోల్పోయింది!

ఇంతకాలం దుమ్ము కొట్టుకుపోయిన నేల
ఇప్పుడు ఆకుపచ్చని పేజీ తెరవనుంది!

ఆఫీసు నుండి ఇంటికి వచ్చే అమ్మ
సుడిగుండంలో చిక్కుకున్న నావయింది!

భీకరంగా చెలరేగిన వాన అర్ధరాత్రి
ఎవరో చెవి పిండితే ఆగిపోయింది!

ఎండాకాలం మనల్ని కాపాడిన మల్లెలు
మట్టి వాసనకు పులకించిపోతున్నాయి!


పొద్దున చూస్తే సూర్యుడు గోరువెచ్చగా
గాలి గమ్మత్తుగా అంతా శుభ్రంగా....!

చెట్ల కొమ్మల మీద తడిసిన పక్షులు
కొత్త జంటల్లా కువకువలు!

కాలం ఎప్పటికీ మాయల మరాఠే
గంతలు కట్టి దృశ్యాలను మార్చేస్తుంది!



కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261.




## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు,
రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad.
Telangana- 500034.



# మణుగూరు కోర్టులో అంతర్జాతీయ యోగా దినోత్సవం

- పాల్గొన్న మెజిస్ట్రేట్ సూరి రెడ్డి..

**మణుగూరు, మహా** : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఆదివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాది కందిమళ్ల నరసింహారావు వివిధ యోగాసనాలను ప్రదర్శిస్తూ వాటి ఆరోగ్యపరమైన ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ కంబపు సూర్యరెడ్డి మాట్లాడుతూ... యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు, మానసిక ప్రశాంతతను కలిగించే సమగ్ర జీవన విధానమన్నారు. నేటి వేగవంతమైన జీవితంలో ఒత్తిడి, ఆందోళనలను అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయిస్తే ఆరోగ్యంతో పాటు పనితీరులోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. అలాగే నిరంతర యోగా సాధన మనలో క్రమశిక్షణను పెంపొందించడమే కాకుండా శారీరకమానసిక సమతుల్యతను అందిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా బాధ్యతాయుతమైన వృత్తుల్లో ఉన్న న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఏకాగ్రత, నిర్ణయ సామర్థ్యం మరింత పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ పాటి నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుకృష్ణ, కార్యదర్శి కామానాని మధు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యురాలు, న్యాయవాది వీరంకి పద్మావతి, న్యాయవాదులు విజయ్, ఐద్దం శ్రీనివాస రెడ్డి, చిర్రరవి, నగేష్ కుమార్, అంకం వెంకటేశ్వరరావు, నాగార్జున రెడ్డి, రామ్మోహన్ రావు, వాసవి, ఎం.ఎల్.ఎస్.సి కో ఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# యోగ సాధన చేయండి..ఆరోగ్యంగా ఉండండి

- జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి పరంధామరెడ్డి




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి అన్నారు. జిల్లా ఎన్‌సీసీ యూనిట్ జిల్లా యువజన క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాల్వంచ మినీ స్టేడియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి పరంధామరెడ్డి మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని అన్నారు. ఎన్‌సీసీ జిల్లా కోఆర్డినేటర్, టిటిడబ్ల్యూఆర్‌జేసీ కొత్తగూడెం ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వమని పేర్కొన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాధాన్యత మరింత పెరిగిం దని యోగాను క్రమం తప్పకుండా ఆచరించడం ద్వారా శారీరక మానసిక దృఢ త్వంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ఎన్‌సీసీ 11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ఎస్.కె.భద్రా మాట్లాడుతూ యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతిరోజూ ఆచరించాలని సూచించారు. ముఖ్యంగా యువత విద్యార్థులు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవరుచుకోవచ్చని తెలిపారు. సుమారు 400 మంది యువత క్రీడాకారులు ఎన్‌సీసీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో యోగా నిపుణుల ఆధ్వర్యంలో వివిధ యోగా ఆసనాలు ప్రాణా యామాలు ధ్యాన ప్రక్రియలను నిర్వహించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత ఏకాగ్రత పెంపొందుతాయని ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని పాల్గొన్న వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో టిటిడబ్ల్యూఆర్‌జేసీ కొత్తగూడెం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ, డీఏవీ నవభారత్, ఓబీపీఎస్, కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్, సింగరేణి విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కేటీపీఎస్, ఏడీఈ, ఎన్‌సీసీ అధికారులు, వైద్య నిపుణులు, క్రీడా కోచ్‌లు కళ్యాణ్, డేనియల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పర్యావరణ హితం లక్ష్యంగా సీడ్ బాల్స్ కు రూప కల్పన

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** వివిధ రకాల విత్తనాలతో ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్(ఐ ఎస్ జి ఎఫ్) భద్రాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. చుంచుపల్లి మండలం ఎల్ఐసి ఆఫీస్ వెనక ఎస్ జి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఏస్కె. జరీనాబీ నివాసంలో పర్యావరణహితం కోసం రానున్న వర్షాకాలంలో ఎక్కడైతే కొండలు గుట్టలు అటవీ ప్రాంతాల్లో మొక్కల సంఖ్య తక్కువగా ఉందో ఆ ప్రాంతంలో ఈ సీడ్ బాల్స్ ను వెదజల్లే విధానంతో వేయడం ద్వారా తిరిగి మొక్కలు మొలకెత్తి వృక్షాలుగా మారే అవకాశం ఉన్నందున ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, జిల్లా కోఆర్డినేటర్ జ్యోతి రాణి, జిల్లా కోశాధికారి సమ్మయ్య, జాయింట్ సెక్రటరీ కళ్యాణి, ఉమెన్స్ గిల్డ్ జిల్లా కోశాధికారి సోనా, ఎస్ జీ ఎఫ్ జిల్లా బాధ్యులు నసీం పాషా, శనగ రాంచందర్ రావు, ఖాదర్ మోహినుద్దీన్, చుంచు అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి

- లబ్ధిదారురాలికి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే పాయం..

**మణుగూరు, మహా** : పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరంగా మారుతోందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పినపాక మండలం టీ కొత్తగూడెం గ్రామానికి చెందిన ఎరుకొండ లక్ష్మి నిర్మలకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేస్తోందన్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి పథకం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. కాగా, చెక్కు అందుకున్న లబ్ధిదారురాలు ఎరుకొండ లక్ష్మి నిర్మల ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వాట్సాప్ కదిలించింది...!

## రక్తదానం కు వరస కట్టిన యవత

**నేలకొండపల్లి, జూన్ 21 మహా:** సోషల్ మీడియా లో యువత అవసరం లేని అభ్యంతరకరమైన విషయాలను పోస్టు చేస్తారని... నానుడి మాట...కానీ వాట్సాప్ లో ప్రజా ప్రయోజనాలకు కూడ సత్వరమే స్పందిస్తారని యువత నిరూపించారు. చిన్నారి పరిస్థితి విషమించింది...బ్లడ్ కావాలని వాట్సాప్ గ్రూప్ లో వైరల్ చేశారు. అంతే యువత బ్లడ్ ఇచ్చేందుకు హస్పిటల్ కు వరస కట్టారు. బ్లడ్ ఇచ్చి చిన్నారి ని కాపాడారు....వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని శంకరగిరితండా గ్రామానికి చెందిన ప్రసాద్ కు ఏడు రోజుల క్రితం బాబు జన్మించాడు. కానీ చిన్నారి కి ప్లేటేలేట్స్ 29 వేలు ఉన్నాయి. వెంటనే ఏ పాజిటివ్ బ్లడ్ అవసరం ఉందని వైద్యులు చెప్పారు. అత్యవసర పరిస్థితులలో తండ్రి గ్రామ వాట్సాప్ గ్రూప్ లో వేడుకున్నాడు. అంతే యువత స్పందించి మండలం లోని పలు గ్రామాలకు చెందిన వాట్సాప్ గ్రూప్లలో వైరల్ చేశారు. ఈ నేపథ్యంలో మంగాపురంతండా గ్రామానికి చెందిన వాట్సాన్ గ్రూప్ అడ్మిన్ తేజావత్ గిరిబాబు మరికొన్ని గ్రూప్లలో వైరల్ చేయటంతో స్థానిక యువత స్పందించారు. తాము ఇస్తామని ముందుకొచ్చారు. మంగాపురంతండా గ్రామానికి చెందిన భువనేశ్వర్ అనే యువకుడు వెంటనే హస్పిటల్ కు వెళ్లి రక్తదానం చేశారు. చిన్నారికి రక్తం అందించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉన్నారు. యువత వాట్సాప్ సందేశం కు స్పందించి చిన్నారి ని కాపాడేందుకు భాగస్వాములైయ్యారు. యువతను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

- యోగాతో ఆరోగ్యవంతమైన జీవన విధానం సాధ్యం
- అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**: ఆరోగ్యమే మహాభాగ్యమని యోగాతో ఆరోగ్యవంతమైన జీవన విధానం సాధ్యమవుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతి మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. యోగా అనేది భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన గొప్ప జీవన విధానమని పేర్కొన్నారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం మానసిక ప్రశాంతత ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని సూచించారు. యువత మహిళలు విద్యార్థులు ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించే వేదికగా నిలుస్తోందని పేర్కొంటూ ప్రజలందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి తుకారం రాథోడ్, ఆయుష్ డిపార్ట్మెంట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ అరుణ, మెడికల్ ఆఫీసర్ అండ్ డిప్యూటీ డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ ఫర్ యోగ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మహేష్, ఆయుష్ యోగ ఇన్స్ట్రక్టర్స్ మేల్ అండ్ ఫిమేల్ రమేష్ బాబు, కమలా రాణి, ప్రమీల, లక్ష్మి, సునీత, ఆయుష్ డిపార్ట్మెంట్ మెడికల్ ఆఫీసర్స్, ఫార్మసిస్ట్ అదర్ డిపార్ట్మెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా యోగా వేడుకలు

**నేలకొండపల్లి, జూన్ 21 మహా:** ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా మండలం లోని వివిధ గ్రామాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ డే లో పలువురు పాల్గొన్నారు.యోగా విన్యాసాలను ప్రదర్శించారు. యోగా వలన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులతో పాటు బీజెపీ పార్టీ నాయకులు పాగర్తి సుధాకర్, మల్లెబోయిన గోవిందరావు, కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి, పిట్టల సూరిబాబు, రామకృష్ణ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని పలు ప్రవేట్ సంస్థలలో యోగా డే ను నిర్వహించారు. మండలం లోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాలలో పలు చోట్ల యోగా దినోత్సవం ను నిర్వహించారు.

# ఆరోగ్యకరమైన జీవనశైలికి... 'యోగా'నే అమూల్యమైన సాధనం

- శరీరం, ఆత్మను సమతుల్యం చేసేది ప్రాణయమే.
- నిత్య జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలి.
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్




**కుషాయిగూడ, మహా** : ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగానే అమూల్యమైన సాధనమని, నిత్య జీవితంలో యోగాను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని హఠయోగా ఆశ్రమ నిర్వాహకుడు శంకరాచారి ఆధ్వర్యంలో జవహర్ నగర్ ఫ్లవర్ (రోజ్ గార్డెన్) గార్డెన్ లో ఆదివారం యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ ఉరుకులు, పరుగుల జీవితంలో మనషులు శారీరంపై శ్రద్ధ వదిలేస్తారని, రకరకాల రోగాలు మనకు తెలియకుండానే ప్రవేశించి జీవితాన్ని నాశనం చేస్తున్నాయని, మనషి చురకత్తిలా మారాలంటే మనసును, శరీరాన్ని ఏకం యోగానే పరమౌషధమని అన్నారు. యోగా అంటే ఆసనాలు, ఊపిరి బిగపట్టడమో కాదని, జీవితాన్ని ఆధీనంలోకి తెచ్చుకోవడమని గుర్తు చేశారు. మధుమేహం, బీపీ ప్రాణాయంతో అదుపులోకి వస్తుందని, వయసుతోభేదం లేకుండా యోగా చేయవచ్చని పేర్కొన్నారు. జవహర్ నగర్ డంపింగ్ దుర్వాసనతో ప్రజలు తీవ్రమైన శ్వాసకోస వాధ్యుల బారీన పడుతున్నారని, వారికి యోగానే చక్కటి పరిష్కార మార్గమని తెలిపారు. పేదలను దృష్టిలో పెట్టుకొనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలను కేటాయించామని, పనులు త్వరలోనే మొదలవుతాయన్నారు. యోగా ఆశ్రమం కోసం త్వరలోనే 2 ఎకరాల స్థలాన్ని కేటాయించేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం యోగా గురువు శంకరాచారి చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి ఉత్తరాఖండ్ రిషికేసులో గల రుద్రయోగ పీఠ్ లో హఠయోగ అష్టాంగ యోగ విద్యలో శిక్షణ పొందిన ప్రముఖ యోగ గురువు శంకరాచారి ఆధ్వర్యంలో పిల్లలు పెద్దలు రాజకీయ ప్రముఖులు చక్కటి ఆసనాలు సూర్య నమస్కారాలు చేసి అందరిని అలరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ మేయర్లు శాంతికోటేష్, మేకల కావ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ యాదవ్ ప్రధాన కార్యదర్శి సదానందం, బీసీ సంఘాల ఛైర్మన్ గణేషాచారి, నాగారం వైస్ ఛైర్మన్ మల్లేష్యాదవ్, మాజీ కార్పొరేటర్లు బల్లి రోజా శ్రీనివాస్, లావణ్యసతీష్ గౌడ్, సాయి, మాజీ ఎంపీటీసీ రాజయ్యయాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, బీజేపీ అధ్యక్షులు కమల్, జవహర్నగర్, దమ్మాయిగూడ కు చెందిన వివిధ పార్టీల నాయకులు, హఠ యోగా ఆశ్రమ సభ్యులు నర్సయ్యయాదవ్, రమేష్, ప్రసాద్, చందు, పద్మారావు, శ్రీనివాస్, వీరాచారి, రమేష్, సురేష్, మహేష్, శివాజీ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు 2కే రన్

- విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు

**ఆదిలాబాద్ మహా :** స్వచ్ఛమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 22 సోమవారం ఉదయం 6 గంటలకు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.స్వీప్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ 2కే రన్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమై కలెక్టరేట్ చౌక్, ఎన్టీఆర్ చౌక్ మీదుగా తిరిగి స్టేడియానికి చేరుకుంటుందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ అవగాహన కార్యక్రమంలో ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం

**మొయినాబాద్ మహా:** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా హిమాయత్‌నగర్ హర్ష క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన యోగ కార్యక్రమంలో యోగా గురువు నూనె వెంకటేష్ ముదిరాజ్ పాల్గొన్నారు. యోగ వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు యోగాసనాలు అభ్యసించారు. 60 ఏళ్లు దాటినా ప్రతిరోజూ యోగ చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న వెంకటేష్ ముదిరాజ్ శిక్షణలో అనేక మంది యోగ గురువులుగా ఎదిగినట్లు నిర్వాహకులు తెలిపారు.






# పార్టీ భవిష్యత్తు నిర్మాణానికి యువతే కీలకం

- యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డికి ఎమ్మెల్యే పాయం ఘన సన్మానం

**బూర్గంపాడు, మహా**: పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నూతనంగా నియమితులైన ఎడమకంటి సుధాకర్ రెడ్డిని ఆదివారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీకి యువతే వెన్నెముక. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుంది. సుధాకర్ రెడ్డి నియామకంతో నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్‌కు కొత్త ఉత్సాహం, మరింత బలం చేకూరుతాయి" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువత సంక్షేమం, ఉపాధి కల్పన, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయని, వాటి గురించి యువత విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని, పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను యువతలోకి తీసుకెళ్లడంలో నాయకులు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు మేలు జరుగుతోందని తెలిపారు. యువత కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలిచి, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరిన ఎమ్మెల్యే, పార్టీ అభివృద్ధికి కృషి చేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని స్పష్టం చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, యువజన నాయకులు భజన ప్రసాద్, ఇంగువ రమేష్, దామోదర్ రెడ్డి, మహంకాళి రాములు, నుసుం నాగిరెడ్డి, నవీన్, పార్థు తదితరులు పాల్గొని సుధాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ జైళ్లలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**యోగతోనే ఖైదీలకు సంపూర్ణ ఆరోగ్యం తెలంగాణ జైల శాఖ డిజి సౌమ్య మిశ్రా**

కుషాయిగూడ, మహా: రాష్ట్రంలోని అన్ని జైళ్లలో అంతర్జాతీయ యోగా దినోత్సవం2026ను ఘనంగా నిర్వహించినట్లు తెలంగాణ జైళ్ల మరియు దిద్దుబాటు సేవల శాఖ వెల్లడించింది. డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా ఐపీఎస్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖైదీల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుదలకు ప్రత్యేక యోగా శిక్షణలు అందించారు. జూన్ 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించగా, పతంజలి యోగపీఠ్, బ్రహ్మకుమారీస్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ తదితర సంస్థలు సహకరించాయి. చర్లపల్లి కేంద్ర కారాగారంలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో డా. సౌమ్య మిశ్రా ఖైదీలతో కలిసి సామూహిక యోగా సాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం, భావోద్వేగ స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సానుకూల ఆలోచన, అంతరంగ శాంతి, ఆత్మనిగ్రహం పెరుగుతాయని తెలిపారు. ఖైదీల సంస్కరణ, పునరావాసం కోసం విద్య, నైపుణ్యాభివృద్ధి, కౌన్సెలింగ్, క్రీడలు, సాంస్కృతిక, ఆరోగ్య కార్యక్రమాలను జైళ్ల శాఖ నిరంతరం అమలు చేస్తోందని ఆమె వెల్లడించారు. యోగా కార్యక్రమాల్లో ఖైదీలు ఉత్సాహంగా పాల్గొనడాన్ని అభినందిస్తూ, యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.



# మూడు నెలలుగా జీతాల్లేవు

- అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన




**పెద్దపల్లి, జూన్ 21 (మహా)**: పెద్దపల్లి జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది మూడు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేతనాలు నిలిచిపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం జీతాల జాప్యంపై అధికారులను హెచ్చరించినా తమ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని పేర్కొంటున్నారు.ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ విధులు నిర్వహిస్తున్న తమకు జీతాలు అందక ఇంటి అద్దెలు, పిల్లల విద్యా ఖర్చులు, నిత్యావసరాల నిర్వహణ కష్టంగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేసి తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కోరుతున్నారు.



# ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో యోగా దినోత్సవం

- రెగ్యులర్ వాకింగ్ టీం సభ్యుల యోగాసనాలు
- మెరుగైన ఆరోగ్యం కోసం యోగా చేయాలన్న శిక్షకులు

**ఆదిలాబాద్ మహా**: ప్రస్తుత గజిబిజి జీవన విధానంలో ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఒత్తిడులను ఎదుర్కొంటున్నారని, అలాంటి పరిస్థితుల్లో యోగ ఉత్తమ జీవన విధానమని అంబేద్కర్ ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెగ్యులర్ వాకింగ్ టీం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో యోగాసనాలు వేసారు.ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగాసనాలు, ప్రాణాయామం చేయడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు.ఐక్య రాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. యోగ సాధన ద్వారా రోగనిరోధక శక్తి పెరగడం, ఊపిరితిత్తులు బలపడడం, మనస్సు ఉల్లాసంగా ఉండడం, జీవన నాణ్యత మెరుగుపడడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఐక్య పోరాట సమితి ప్రధాన కార్యదర్శి దర్శనం నగేష్, రెగ్యులర్ వాకింగ్ టీం సభ్యులు పెంటపర్తి ఊశన్న, మల్లేష్, వెంకట్రావు, పాలెం శ్రీనివాస్, రాము, బ్రహ్మ శ్రీను, వినోద్, లక్ష్మణ్, సూర్యకాంత్, నాందేవ్, జలంధర్ రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ లో ఘనంగా యోగా డే..

- ఆసనాలు వేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు,ప్రజలు
- జీవన శైలిలో భాగం చేసుకోవాలని వక్తల పిలుపు




**ఆదిలాబాద్ మహా** : ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవనశైలిలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రెవిన్యూ గార్డెన్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే,మున్సిపల్ చైర్ పర్సన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షకులు కార్యక్రమానికి హాజరైన అందరితో యోగాసనాలు వేయించారు.కలెక్టర్ మాట్లాడుతూ..మన దేశంలో జన్మించిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం అరగంట నుండి గంట పాటు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆధునిక జీవనశైలి వ్యాధుల నుండి దూరం కావచ్చని, అలాగే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు యోగా వల్ల నార్మల్ డెలివరీ అయ్యే అవకాశాలు పెరుగుతాయని, పుట్టే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో యోగా శిక్షకుల ద్వారా శిక్షణ అందించామన్నారు. అలాగే, జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమాలలో భాగంగా వ్యసనాల నుండి విముక్తి పొందడానికి కూడా యోగా ఎంతో దోహదపడుతుందని వివరించారు. గత 12 రోజులుగా జిల్లాలోని వివిధ పాఠశాలలు, గ్రామాల్లో ప్రజలకు యోగా నేర్పించిన శిక్షకులకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, ప్రస్తుత జీవన విధానంలో యోగా సైతం భాగం చేయాలని, ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, యోగా చేయాలని సూచించారు.అనంతరం బ్రహ్మ కుమారీస్ కు సంబంధించిన యోగా పోస్టర్ ను ఆవిష్కరించి, యోగ శిక్షకులను అతిథులు ఘనంగా శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డియంహెచ్వో సాధన, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డిఈఓ మాధవి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆయుష్ వైద్యులు చంద్ర శేఖర్, ప్రీతి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, ఆశా వర్కర్లు, సీనియర్ సిటిజన్లు, వివిధ వర్గాల ప్రజలు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతం : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..

**పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్ మహా:** జిల్లాలో నిర్వహించిన నీట్ (NEETUG)-2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సంయుక్తంగా పర్యవేక్షించారు. జిల్లాలోని కరీంనగర్ లోని ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కేంద్రీయ విద్యాలయంలో పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశం, ద్విస్థాయి భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పరీక్ష సజావుగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల నీట్ పరీక్ష విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పరీక్ష సజావుగా సాగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు. పరీక్ష ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, పరీక్ష పారదర్శక నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం ఏడు పరీక్షా కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులకు గాను 2,661 మంది హాజరు కాగా, 340 మంది గైర్హాజరయ్యారు. కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల - 744 మందికి గాను 662 మంది హాజరు, 82 మంది గైర్హాజరు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల - 720 మందికి గాను 651 మంది హాజరు, 69 మంది గైర్హాజరు అలుగునూరు లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ - 408 మందికి గాను 359 మంది హాజరు, 49 మంది గైర్హాజరు కేంద్రీయ విద్యాలయం - 361 మందికి గాను 316 మంది హాజరు, 45 మంది గైర్హాజరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల - 312 మందికి గాను 278 మంది హాజరు, 34 మంది గైర్హాజరు మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర కళాశాల - 288 మందికి గాను 251 మంది హాజరు, 37 మంది గైర్హాజరు టీజీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల, చింతకుంట - 168 మందికి గాను 144 మంది హాజరు, 24 మంది గైర్హాజరు.

# ఆదర్శ కార్మిక నాయకురాలు మహబూబి

**గాదెపాడు లో మహబూబి వర్ధంతి**

**కారేపల్లి, మహా :** అంగన్వాడీల హక్కులు, సమస్యల పరిష్కారానికి పోరాడిన ఆదర్శ నాయకురాలు ఎండి మహబూబి అని అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) కామేపల్లి ప్రాజెక్టు కార్యదర్శి దుగ్గి పాపారాణి కొనియాడారు. విధులలో ఉండి ప్రమాదంలో మరణించిన ఎండి మహబూబి మొదటి వర్ధంతి సభ కామేపల్లి ప్రాజెక్టు అధ్యక్షురాలు సోమందుల నాగమణి అధ్యక్షతన గాదెపాడు లో ఆదివారం జరిగింది. ఈ సభలో దుగ్గి పాపారాణి మాట్లాడుతూ పేదల ఆరోగ్యం, చదువుకు ఉపయోగపడే అంగన్వాడీ వ్యవస్థకు టీచర్స్, హెల్పర్స్ తమ శక్తిని ధార పోస్తుంటే వారికి కావలసిన కనీస సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించకపోవటం విచారకరమన్నారు. అనేక కష్టనష్టాలకు ఓర్చి పనిచేస్తున్న కార్మిక చట్టాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పును ఐసీడీఎస్ లో అమలు జరగడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వ్యవస్థను అందులో పని చేస్తున్న ఆడపడుచులకు కనీస హక్కులు, కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం పట్ల చిత్తశుద్ధి కనపరచటం లేదన్నారు. అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు, కార్మిక చట్టాల రద్దుతో భవిష్యత్తులోనూ కార్మికుల భవిష్యత్తు అంధకారంలో పడనుందన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై పోరాటాల్లో మహబూబి ముందు నిలిచారన్నారు. ఆమె స్ఫూర్తి తో నడవడమే ఆమెకు ఇచ్చే నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జ రామారావు, నాయకులు ఎండీ. ఇస్మాయిల్, యనమనగండ్ల శీను, షేక్ శిలారు అంగన్వాడీ నాయకురాళ్ళు రాణి, ఆదిలక్ష్మి, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి లో ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**కారేపల్లి, మహా:**వైరా మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ జన్మదిన వేడుకలను కారేపల్లి మండలంలో ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా అజ్మీర వీరన్న నాయక్ మాట్లాడుతూ మండలంలో మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ చేసిన అభివృద్ధిని కొనియాడారు మండలంలో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, నాయకులు భూక్య రాంకిషోర్ నాయక్, జరపల ప్రసాద్, బానోత్ కోటి, వాంకుడోత్ కరణ్ సింగ్, భూక్య రాంకీ, కారేపల్లి ప్రముఖ వ్యాపారవేత్త పిల్లి వెంకటేశ్వర్లు, మహిళ నాయకురాలు పప్పుల నిర్మల, బిఆర్ ఎస్ విద్యార్థి విభాగం వైరా అధ్యక్షుడు జూపల్లి రాము, యువజన నాయకులు దామెర్ల నాగరాజు అశోక్ గజ్జల సంపత్ తలకలపల్లి శ్రీను షేక్ మహబూబ్ డీలర్ జాను తదితరులు పాల్గొన్నారు.



# ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం..

- డ్రైవర్ అప్రమత్తతో 40 మంది ప్రయాణికులు సురక్షితం..

**కరీంనగర్ మహా** : కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సులో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ అప్రమత్తతతో బస్సులో ఉన్న 40 మంది ప్రయాణికులు సురక్షితంగా బయట పడటంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం ఉదయం 8 గంటలకు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. బస్సు అలుగునూరు శివారులోని కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ ప్రశాంత్ వెంటనే అప్రమత్తమై బస్సును రహదారి పక్కకు నిలిపివేశారు. అనంతరం ప్రధాన ద్వారంతో పాటు అత్యవసర నిష్క్రమణ ద్వారాలను తెరిచి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తరలించారు.ప్రయాణికులను సురక్షితంగా దింపిన అనంతరం బస్సులోని అగ్నిమాపక పరికరాలతో మంటలను అదుపు చేసేందుకు సిబ్బంది ప్రయత్నించినప్పటికీ, మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# రేవంత్ రెడ్డి పోవాలి కెసిఆర్ రావాలి..

**శంషాబాద్ సభలో కేటీఆర్...**

**రాజేంద్రనగర్ మహా ;** బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో విస్తృత స్థాయి సమావేశం శంషాబాద్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు.శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధితుల కుటుంబాలను కేటీఆర్ స్వయంగా కలిసి పరామర్శించారు. శంషాబాద్ మండలానికి చెందిన సుమారు 250 ఎకరాల భూమి విషయంలో స్థానిక రైతులు, బాధితులు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యను చెప్పుకున్నారు. రెవెన్యూ శాఖ మంత్రులు తమను బెదిరిస్తున్నారని, భూమిని తమకు రాసివ్వాలని లేదా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి పోవాలి కెసిఆర్ రావాలని నినాదం జోరుగా సాగుతుందన్నారు. రాబోయే ఎన్నికలలో నినాదాన్ని రుజువు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులకు తెలిపారు. ఈ భూకబ్జా వ్యవహారంపై స్పందించిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేదల భూములను లాక్కుంటున్నారని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. తెలంగాణలో ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి అమలు కానీ హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిండు. స్థానిక సంస్థ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్తారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి




మొయినాబాద్ మహా: యోగా ద్వారా ఆరోగ్యం సామరస్యం, మానసిక ప్రశాంతత మరియు సమగ్ర వికాసంతో కూడిన జీవనానికి మనమందరం అంకితమవుదాం అని డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మోయినాబాద్ మండలంలోని చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) హిమాయత్‌నగర్ ప్రాంగణంలో విశేష ఉత్సాహం, క్రమశిక్షణ మరియు ఆధ్యాత్మిక వాతావరణం మధ్య యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అధ్యాపకులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేసి ఆరోగ్యకరమైన జీవన విధానానికి తమ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. సాత్విక రెడ్డి మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యంత విలువైన ఆధ్యాత్మిక మరియు ఆరోగ్య సంపదలలో యోగా ఒకటని పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి ఆందోళనలు అనారోగ్య సమస్యల మధ్య యోగా వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మానసిక సమతుల్యతను పెంపొందించి జీవితానికి సానుకూల దృక్పథాన్ని అందిస్తుందని ఆమె వివరించారు. యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం కాదని, అది మనసు శరీరం ఆత్మల మధ్య సమన్వయాన్ని నెలకొల్పే సమగ్ర జీవన విధానమని ఆమె పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా వ్యక్తి శారీరక దృఢత్వాన్ని మానసిక ప్రశాంతతను భావోద్వేగ స్థిరత్వాన్ని మరియు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనానికి నిదర్శనమని ఆమె అన్నారు. ముఖ్యంగా యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలంటే యోగాను తమ దైనందిన జీవనశైలిలో భాగంగా స్వీకరించాలని సూచించారు. విద్యార్థులు విద్యా ప్రతిభతో పాటు శారీరక మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.అనంతరం వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. శంకర్ లింగం మాట్లాడుతూ యోగా సాధన ద్వారా క్రమశిక్షణ ఏకాగ్రత సహనం ఆత్మవిశ్వాసం వంటి విలువలు అభివృద్ధి చెందుతాయని ఇవే వ్యక్తిగత మరియు వృత్తిపరమైన విజయాలకు పునాదిగా నిలుస్తాయని ఆయన వివరించారు. ఆరోగ్యం, సామరస్యం మరియు సమగ్ర వికాసంతో కూడిన సమాజ నిర్మాణానికి యోగా ఒక శక్తివంతమైన సాధనమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకుని ఆరోగ్యకరమైన ఆనందమయమైన మరియు సార్థకమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన యోగా ప్రదర్శనల్లో విద్యార్థులు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామ పద్ధతులను అభ్యసిస్తూ యోగా యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ



# కారేపల్లి లో ఘనంగా జయశంకర్ వర్ధంతి

**కారేపల్లి, మహా:** బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని ఆదివారం కారేపల్లిలో నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్ నాయక్, రైతు బంధు మండల మాజీ అధ్యక్షులు హన్మకొండ రమేష్, గేటు కారేపల్లి ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసరావు, నాయకులు తాతా వెంకటేశ్వర్లు, డొంకెన రవీందర్, గంగరబోయిన సత్యం, సోమందల నాగరాజు, మణిగొండ నాగేశ్వరరావు, భూక్య మోహన్, గుగులోత్ జుంకీలాల్ పాల్గొన్నారు.




# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి

# యోగ తప్పనిసరి...

- ప్రతి ఒక్కరి జీవనశైలిలో యోగాను భాగం చేసుకోవాలి
- రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగాను ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం చేసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆదివారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి స్టేడియంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన సాంస్కృతిక వారసత్వమని, ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మనస్సు, శరీరం, ఆత్మల మధ్య సమతుల్యతను నెలకొల్పే సమగ్ర జీవన విధానమని పేర్కొన్నారు. జీవనశైలిలో ప్రతిరోజు యోగ సాధన చేయాలి... ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, జీవనశైలి సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా అత్యుత్తమ మార్గమని తెలిపారు. ప్రతిరోజూ కొద్దిసేపు యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని అన్నారు. భారతీయ యోగ విశ్వ వ్యాప్తంగా గుర్తింపు... ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రకటించడం ద్వారా యోగా విశ్వవ్యాప్త గుర్తింపు పొందిందని, నేడు ప్రపంచ దేశాలు భారతీయ యోగా సంప్రదాయాన్ని ఆదరిస్తుండటం ప్రతి భారతీయుడికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. "ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్య భారత నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుంది. యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు సహా ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలి. ప్రతి ఇంటిలో యోగా సంస్కృతి పెంపొందితే ఆరోగ్య సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చు" అని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, వైద్య & కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చోంగ్థు, ఐఏఎస్, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్, శేరిలింగంపల్లి తహసీల్దార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. స్వర్ణకుమారి, వివిధ శాఖల అధికారులు, యోగా గురువులు, విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
07
సోమవారం, హైదరాబాద్ | 22-06-2026 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS
WWW.MAHAADAILY.COM

# టెకీలు.. ఏఐ వాడితే సేఫ్.. లేకుంటే లేఆఫ్!

కృత్రిమ మేధస్సు కార్యాలయాల్లో కేవలం ఉత్పాదకతను పెంచే సాధనంగా మాత్రమే కాకుండా, ఉద్యోగ భద్రతను ప్రభావితం చేసే కీలక నైపుణ్యంగా మారుతున్నట్లు తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. అమెరికాకు చెందిన ప్రముఖ పరిశోధనా సంస్థ గాలప్ నిర్వహించిన సర్వే ప్రకారం, ఏఐ సాధనాలను క్రమం తప్పకుండా ఉపయోగించే టెక్నాలజీ ఉద్యోగులు తమ ఉద్యోగాలను నిలబెట్టుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది.



### మూడు రెట్లు అధిక ముప్పు

గత ఫిబ్రవరిలో 23 వేల మందికి పైగా అమెరికన్ ఉద్యోగులపై నిర్వహించిన అధ్యయనంలో, ఇటీవల ఉద్యోగాలు కోల్పోయిన 660 మంది అభిప్రాయాలను కూడా పరిశీలించారు. ఈ విశ్లేషణ ప్రకారం.. కనీసం నెలకు ఒకసారి అయినా ఏఐ టూల్స్ ఉపయోగించే టెక్ ఉద్యోగులకు లేఆఫ్ అయ్యే అంచనా ప్రమాదం 6 శాతం మాత్రమే ఉండగా, ఏఐని అరుదుగా ఉపయోగించే లేదా పూర్తిగా దూరంగా ఉంచే ఉద్యోగుల్లో అది 18 శాతానికి చేరింది. అంటే ఏఐ వినియోగం లేని టెకీలకు ఉద్యోగం కోల్పోయే ప్రమాదం దాదాపు మూడు రెట్లు అధికంగా ఉందని గాలప్ పేర్కొంది. అధ్యయనం ప్రకారం.. కంపెనీలు ఇప్పుడు నియామక కాల సమయంలో కేవలం డిగ్రీలు, అనుభవం మాత్రమే కాకుండా ఏఐ అక్షరాస్యత, ఆటోమేషన్ టూల్స్‌పై అవగాహన, ప్రాంప్ట్ ఇంజినీరింగ్ వంటి నైపుణ్యాలను కూడా పరిశీలిస్తున్నాయి. సంస్థల్లో పునర్వ్యవస్థీకరణ లేదా ఖర్చు తగ్గింపు చర్యల సమయంలో కూడా ఏఐ సామర్థ్యం ఉన్న ఉద్యోగులకు ప్రాధాన్యం లభించే అవకాశాలు పెరుగుతున్నాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఉద్యోగాలు కోల్పోయిన వారిలో కేవలం 1 శాతం మంది మాత్రమే తమ ఉద్యోగ నష్టానికి ఏఐ ప్రత్యక్ష కారణమని భావించారు. ఎక్కువ మంది ఆర్థిక పరిస్థితులు, పునర్వ్యవస్థీకరణలు, వ్యయ నియంత్రణ చర్యలను కారణాలుగా పేర్కొన్నారు. అయితే సంస్థల నిర్ణయ ప్రక్రియలో ఏఐ నైపుణ్యం పరోక్ష ప్రభావం చూపుతున్నట్లు గాలప్ శాస్త్రవేత్త జిమ్ హార్టర్ అభిప్రాయపడ్డారు.

### సగం మంది వాడేస్తున్నారు..

ఇదిలా ఉండగా, అమెరికాలో కార్యాలయాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2023లో 21 శాతం మంది ఉద్యోగులు మాత్రమే ఏఐ ఉపయోగిస్తున్నట్లు చెప్పగా, 2026 నాటికి ఆ సంఖ్య 50 శాతానికి చేరుకుంది. రోజువారీగా ఏఐ ఉపయోగించే ఉద్యోగుల వాటా కూడా నిరంతరం పెరుగుతోంది. ముఖ్యంగా టెక్నాలజీ, ఫైనాన్స్, ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగాల్లో ఈ వినియోగం అత్యధికంగా నమోదైంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, భవిష్యత్తులో ఏఐ పూర్తిగా ఉద్యోగాలను భర్తీ చేస్తుందా లేదా అన్నది ఇంకా స్పష్టంగా లేకపోయినా, ఏఐతో కలిసి పనిచేయగల సామర్థ్యం మాత్రం ఉద్యోగ మార్కెట్లో కీలక అర్హతగా మారుతోంది. ఒకప్పుడు కంప్యూటర్ పరిజ్ఞానం ఎలా తప్పనిసరి నైపుణ్యంగా మారిందో, ఇప్పుడు ఏఐ వినియోగ సామర్థ్యం కూడా అదే దిశగా పయనిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.



# 'బంగారం, వెండి.. పడిపోతున్నాయ్'

ప్రసిద్ధ 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత, ప్రముఖ ఇన్వెస్టర్ రాబర్ట్ కియోసాకి మరోసారి బంగారం, వెండి, క్రిప్టో ఆస్తులపై ఆశావహ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం బంగారం, వెండి ధరలు పడిపోతున్నప్పటికీ తాను విక్రయించడం లేదని, సరైన సమయంలో కొనుగోలు చేసేందుకు వేచి చూస్తున్నానని తెలిపారు. ధరల ఆధారంగా కాకుండా ఆస్తులు ఉన్న ఆర్థిక, రాజకీయ పరిస్థితులను బట్టి పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. తాజాగా సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టులో కియోసాకి, అమెరికాతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సమస్యలను రాజకీయ, బ్యాంకింగ్ నాయకత్వం సమర్థంగా పరిష్కరించడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో భవిష్యత్తులో బంగారం, వెండి, బిట్ కాయిన్, ఇథీరియమ్ వంటి ఆస్తుల విలువలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక చార్టులను పరిశీలిస్తున్నానని, బంగారం, వెండి ధరలు భారీ ర్యాలీకి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయని కియోసాకి చెప్పారు. అయితే తన అభిప్రాయాలను గుడ్డిగా నమ్మవద్దని, ప్రతి ఒక్కరూ స్వయంగా పరిస్థితులను విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాబోయే కాలం ఆసక్తికరంగా ఉండబోతోందని, తెలివిగా వ్యవహరించే ఇన్వెస్టర్లు మరింత సంపద సృష్టించుకోగలరని ఆయన వ్యాఖ్యానించారు.

# సంపదలో సగం సమాజానికే ఇవ్వండి: మెలిండా గేట్స్

ఇటీవల స్పేస్‌ఎక్స్ ఐపీఓ విజయవంతంగా పూర్తికావడంతో ఎందోమంది కోటీశ్వరులు, బిలియనీర్లుగా మారారు. భవిష్యత్తులో ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి ప్రముఖ టెక్ కంపెనీలు కూడా ఐపీఓకు వచ్చే అవకాశాలు ఉండటంతో మరింత మంది ధనవంతులు అవుతారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ప్రపంచ ప్రఖ్యాత దాతృత్వవేత్త 'మెలిండా ఫ్రెంచ్ గేట్స్' ఓ కీలక సందేశాన్ని ఇచ్చారు. మెలిండా ఫ్రెంచ్ గేట్స్ అభిప్రాయం ప్రకారం.. పెద్ద మొత్తంలో సంపద సంపాదించే అవకాశం లభించినవారు తమ సంపదలో కనీసం సగం భాగాన్ని సమాజానికి తిరిగి ఇవ్వాలని ఇప్పటి నుంచే నిర్ణయించుకోవాలి. ఐపీఓల ద్వారా కోట్లాది డాలర్ల సంపద పొందగలిగే స్థితిలో ఉన్నవారికి, అదే స్థాయిలో దానం చేసే సామర్థ్యం కూడా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. సంపద అనేది కేవలం వ్యక్తిగత విజయానికి గుర్తు మాత్రమే కాదు, సమాజం పట్ల ఉన్న బాధ్యతకు కూడా ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. అమెరికాలో బిలియనీర్లుగా ఎదిగిన వారు దేశం అందించిన అవకాశాలను గుర్తుంచుకోవాలని మెలిండా సూచించారు. మంచి




విద్యా వ్యవస్థ, ఆరోగ్య సేవలు, రహదారులు, సమాచార మౌలిక వసతులు వంటి ప్రజా వనరుల వల్లే పెద్ద కంపెనీలు అభివృద్ధి చెందగలిగాయని ఆమె వివరించారు. అందువల్ల సమాజం నుంచి లభించిన అవకాశాలను తిరిగి సమాజ అభివృద్ధికే ఉపయోగించాల్సిన బాధ్యత ధనవంతులపై ఉందని ఆమె చెప్పారు. మెలిండా ఫ్రెంచ్ గేట్స్ వ్యక్తిగత సంపద సుమారు 19 బిలియన్ డాలర్లుగా అంచనా. ఆమె 2010లో వారెన్ బఫెట్, ఆమె మాజీ భర్త బిల్ గేట్స్‌తో కలిసి గివింగ్ ప్లెడ్జ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచంలోని అత్యంత ధనవంతులు తమ సంపదలో ఎక్కువ భాగాన్ని జీవితకాలంలో గానీ, మరణానంతరం గానీ దానం చేయాలని ప్రతిజ్ఞ చేస్తారు. ఇప్పటివరకు 250 మందికి పైగా ప్రముఖ దాతలు ఈ కార్యక్రమంలో చేరారు. వీరిలో మెకెంజీ స్కాట్, కాన్వా సహ వ్యవస్థాపకులు మెలానీ పెర్కిన్స్, క్లిఫ్ ఓబ్రెచ్ట్, ఎయిర్‌బీఎన్‌బీ సహ వ్యవస్థాపకుడు బ్రియాన్ చెస్కీ వంటి ప్రముఖులు ఉన్నారు. గేట్స్ ఫౌండేషన్ నుంచి వైదొలిగిన తరువాత, మెలిండా తన స్వతంత్ర సంస్థ పివోటల్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల మహిళల మధ్యవయస్సు ఆరోగ్యం, మెనోపాజ్ సంబంధిత సమస్యల కోసం 215 మిలియన్ డాలర్ల నిధులను ప్రకటించారు. ధనవంతుల ప్రవర్తన గురించి అడిగినప్పుడు, సంపదను ఆడంబరంగా ప్రదర్శించడం తనకు నచ్చదని మెలిండా స్పష్టం చేశారు. అవసరమైన మంచి వస్తువులు కొనుగోలు చేయడంలో తప్పేమీ లేదు, కానీ సంపదను ప్రదర్శిస్తూ ఇతరులను ఆకర్షించే ప్రయత్నం చేయడం సమాజానికి ఎలాంటి మేలు చేయదని ఆమె అభిప్రాయపడ్డారు.

## భారత్ ఈయూ ఒప్పందం...
# పీయూష్ గోయల్ కీలక ప్రకటన!

భారత్ 27 దేశాల యూరోపియన్ యూనియన్ మధ్య కుదరబోయే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ ఆర్థికాభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా మారనుంది. ఈ ఒప్పందంపై 2026 డిసెంబర్ నాటికి సంతకం చేసే అవకాశం ఉందని, ఆ తరువాత 2027 ఫిబ్రవరి మార్చి నెలలలో అమలులోకి రానున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్‌గోయల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని 'అన్ని ఒప్పందాలకు మాతృక' లాంటిదని అభివర్ణిస్తున్నారు. ఎందుకంటే ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక భాగస్వామ్యాల్లో ఒకటిగా నిలవనుంది. భారత్ ఈయూ కలిసి ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 25 శాతం వాటాను కలిగి ఉన్నాయి. అంతేకాకుండా.. ప్రపంచ అంతర్జాతీయ వాణిజ్యంలో దాదాపు మూడవ వంతు వాటా ఈ రెండు భాగస్వామ్యాలదే. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత, భారతదేశం నుంచి ఈయూ దేశాలకు ఎగుమతి చేసే



సుమారు 93 శాతం వస్తువులకు సుంకం లేకుండా మార్కెట్ ప్రవేశం లభిస్తుంది. దీని వలన భారతీయ వస్త్రాలు, ఔషధాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు వంటి అనేక రంగాలకు భారీ అవకాశాలు ఏర్పడతాయి. మరోవైపు, ఈయూ దేశాల నుంచి దిగుమతి అయ్యే లగ్జరీ కార్లు, వైన్ వంటి వస్తువులపై సుంకాలు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల భారత వినియోగదారులు ఈ ఉత్పత్తులను తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం కలుగుతుంది. అయితే దేశీయ పరిశ్రమలపై ప్రభావం పడకుండా తగిన రక్షణ చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉంది. మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి భారతదేశంపై ఉందని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అమెరికాతో కూడా వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. అలాగే కెనడా కూడా భారతదేశంతో ఒప్పందం కుదుర్చుకోవడానికి సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.



## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# అమెరికా గడ్డపై యోగా.. డెలావేర్ సంచలన ప్రకటన!

**డెలావేర్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 వేళ ప్రపంచ వేదికపై భారతదేశ ప్రాచీన సంస్కృతికి మరో అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలోని డెలావేర్ రాష్ట్రం జూన్ 21ని అధికారికంగా 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా గుర్తిస్తూ సంచలన ప్రకటన చేసింది. అటు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ సైతం యోగా విశ్వవ్యాప్తమైందని ప్రశంసించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా ఏ విధంగా బాటలు వేస్తోందో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

### డెలావేర్ అధికారిక ప్రకటన – గవర్నర్ కీలక నిర్ణయం

అమెరికా రాష్ట్రమైన డెలావేర్ గవర్నర్ మాథ్యూ మేయర్ జూన్ 21, 2026ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భారతదేశంలో ఉద్భవించిన 5,000 ఏళ్ల నాటి ఈ అద్భుత శైలి, మానసిక క్లారిటీని, శారీరక దృఢత్వాన్ని, భావోద్వేగ సమతుల్యతను పెంపొందిస్తుందని గవర్నర్ కొనియాడారు. ఈ





చారిత్రాత్మక నిర్ణయంపై న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ హర్షం వ్యక్తం చేస్తూ, గవర్నర్ మేయర్‌కు, దీనికి సహకరించిన డెలావేర్‌లోని భారతీయఅమెరికన్ సమాజానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఐరాస అధినేత ప్రశంసలు – విశ్వవ్యాప్తమైన యోగా

మరోవైపు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ యోగా ప్రాముఖ్యతను కొనియాడుతూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రాచీన భారతదేశంలో పుట్టిన యోగా.. నేడు కుల, మత, సంస్కృతులకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది జీవితాల్లో భాగమైందని పేర్కొన్నారు. యోగా అనేది కేవలం వ్యాయామం కాదని, అది మన పట్ల, సమాజం పట్ల, భూగ్రహం పట్ల శ్రద్ధ వహించడాన్ని నేర్పుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, 'నమస్తే' అంటూ ఆయన పిలుపునిచ్చారు.

### మోదీ ప్రతిపాదనతో..

నిజానికి, జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా మార్చడంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారు. 2014 సెప్టెంబర్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 69వ సమావేశంలో పీఎం మోదీ ఈ ప్రతిపాదనను తీసుకువచ్చారు. దీనికి ప్రపంచ దేశాల నుంచి మద్దతు లభించడంతో, అదే ఏడాది డిసెంబర్ 11న ఐక్యరాజ్యసమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా అధికారికంగా ప్రకటించింది. అప్పటి నుండి ప్రతి ఏటా ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా యోగా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.



## రష్యా నుంచి భారత్‌కు చమురు..
# నావికుడు అరెస్టు

***రష్యా నుంచి భారతదేశానికి వస్తూ ఇంగ్లీష్ ఛానెల్‌ను దాటుతున్న షాడో- ఫ్లీట్ అనే ఆయిల్ ట్యాంకర్‌ను బ్రిటన్ అధికారులు అడ్డుకున్నారు. ఆ నౌక కెప్టెన్‌నైనా అజయ్ పంత్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. దీంతో ఆ కెప్టెన్ కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా ఆయనను విడిపియ్యాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.***

"రష్యా (ఆంక్షలు) నిబంధనలు 2019" లోని 'రెగ్యులేషన్ 46Z9B' ని ఉల్లంఘిస్తూ.. రష్యా చమురును ఇతర దేశానికి ఓడ ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సరఫరా చేసినట్లు ఆయనపై కేసు నమోదు చేశారు. అయితే ఆయన తరపున కేసు వాదించిన "ఈ నౌక ఎక్కడికి వెళ్లాలి, ఎలాంటి సరుకును తీసుకెళ్లాలి అనేది ఆయన నిర్ణయం కాదు. ఆయన కేవలం కార్పొరేషన్ (కంపెనీ) ఆదేశాలను మాత్రమే పాటించారు. ఆయన తన ఉద్యోగాన్ని చేసుకుంటున్న ఒక ఉద్యోగి మాత్రమే, ఇప్పుడు బ్రిటీష్ కోర్టు ముందు నిలబడాల్సి వచ్చింది" అని పేర్కొన్నారు.ఇరు వాదనలు విన్న అక్కడి కోర్టు ఈ కేసు తదుపరి విచారణను జూలై 16కు వాయిదా వేసింది.

### భార్య ఆవేదన

అజయ్ పంత్ భార్య.. రీతు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో బ్రిటీష్ మీడియా నివేదికల ద్వారానే తన భర్త అరెస్ట్ విషయం తెలిసింది. UK లేదా భారత అధికారుల నుండి తమకు ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని చెప్పారు. ఆయన కేవలం కంపెనీ ఆదేశాల మేరకే నౌకను నడిపారని, ఇందులో ఆయన తప్పేమీ లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రభుత్వం స్పందన


దీనిపై ఉత్తరాఖండ్ హోం సెక్రటరీ శైలేష్ బగౌలీ స్పందిస్తూ.. పంత్ విడుదల మరియు పునరాగమనం కోసం సహాయం చేయాలని కోరుతూ రెండు రోజుల క్రితమే భారత విదేశాంగ శాఖ కు లేఖ రాశామని తెలిపారు. ఢిల్లీలోని తమ ప్రాంతీయ కమిషనర్ కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకుంటున్నారని చెప్పారు. కాగా UKలోని భారత హైకమిషన్‌కు పంత్‌ను కలుసుకునేందుకు అనుమతి లభించింది.. కాగా బ్రిటన్ చరిత్రలో ఇలాంటి ఆపరేషన్ జరగడం ఇదే మొదటిసారి. రాయల్ మెరైన్ కమాండోలు రాత్రి వేళల్లో 'చినూక్' హెలికాప్టర్ ద్వారా నౌకపైకి దిగారు. నేషనల్ క్రైమ్ ఏజెన్సీ అధికారులు నౌకలోని పత్రాలను తనిఖీ చేశారు. బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ఈ ఆపరేషన్‌ను తాను వ్యక్తిగతంగా పర్యవేక్షించానని చెబుతూ, ఇది "రష్యాకు తగిలిన మరో దెబ్బ" అని అభివర్ణించారు.

# అమెరికా-ఇరాన్ అత్యవసర భేటీ

**బెర్న్:** పశ్చిమ ఆసియాలో నెలల తరబడి కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కుదిరిన చారిత్రాత్మక 'ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం' ఆధారంగా ఈ ఉన్నత స్థాయి దౌత్య సమావేశం జరుగుతోంది. కతార్, పాకిస్తాన్ దేశాలు మధ్యవర్తులుగా వ్యవహరిస్తుండగా, స్విస్ దౌత్యవేత్తలు ఈ వేదిక సిద్ధం చేశారు. రాబోయే 60 రోజుల్లో సమగ్ర అణు ఒప్పందాన్ని ఖరారు చేయడం, ప్రాంతీయ శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా ఇరు దేశాల ప్రతినిధులు ఈ చర్చల్లో పాలుపంచుకుంటున్నారు.

### లెబనాన్ సంక్షోభంపై అత్యవసర సమావేశం

ఈ చర్చల మొదటి రోజే ఇజ్రాయెల్‌హిజ్బుల్లా ఘర్షణలపై ఒక అత్యవసర సెషన్‌ను కేటాయించారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఈ చర్చల్లో ఇజ్రాయెల్ గానీ, హిజ్బుల్లా గానీ లేదా లెబనాన్ ప్రభుత్వం గానీ భాగస్వాములు కానప్పటికీ, అమెరికా



తన వ్యూహాన్ని మార్చి ఈ అంశాన్ని ఎజెండాలోకి తెచ్చింది. దక్షిణ లెబనాన్‌లో కొనసాగుతున్న హింసను అరికట్టేందుకు ఇరుపక్షాల చర్చల ప్రతినిధులు అంగీకరించినట్లు వార్తా సంస్థ ఎఎన్ఐ పేర్కొంది. ఇరాన్ తరపున పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ నేతృత్వంలోని బృందం హాజరుకాగా, అమెరికా తరపున వైస్ ప్రెసిడెంట్ జెడి వాన్స్, సీనియర్ ప్రతినిధులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్‌కాఫ్ చర్చల్లో పాల్గొంటున్నారు.

### హోర్ముజ్ జలసంధి వివాదపు నీడలు

మరోవైపు, వ్యూహాత్మక సరిహద్దు ప్రాంతమైన 'హోర్ముజ్ జలసంధి'పై ఇరు దేశాల మధ్య నెలకొన్న విభేదాలు ఈ చర్చలపై ప్రభావం చూపుతున్నాయి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యల ఉల్లంఘనలకు నిరసనగా ఈ జలసంధిపై తమకు నియంత్రణ ఉందని ఇరాన్ క్లెయిమ్ చేయగా, అమెరికా దీనిని ఖండించింది. 60 రోజుల్లోగా తుది ఒప్పందం కుదరకపోతే ఈ షిప్పింగ్ లేన్‌లో అమెరికన్ టోల్స్ విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అయితే ఇరాన్ మాత్రం, ఈ జలసంధిలో వాణిజ్య నౌకల సురక్షిత ప్రయాణం అనేది అంతకుముందు కుదిరిన తాత్కాలిక ఒప్పందాల అమలుపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది.

### 60 రోజుల రోడ్‌మ్యాప్.. తుది ఒప్పందమే లక్ష్యం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఈ వారంలో సంతకం చేసిన ప్రాథమిక ఒప్పంద వివరాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడమే ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. చర్చల ప్రారంభానికి ముందు ఇరాన్ స్పీకర్ గాలిబాఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తాము దేశ అమరవీరులకు, మినాబ్ పాఠశాల ఘటన బాధితులకు జవాబుదారీగా ఉంటూ ఈ చర్చల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కాల్పుల విరమణను కాపాడుకుంటూనే, శాశ్వత అణు ఒప్పందాన్ని సాధించడానికి దౌత్యవేత్తలకు 60 రోజుల గడువు ఇచ్చారు.



# వారణాసిలో ఫైట్

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న మైథలాజికల్ అడ్వెంచరస్ అండ్ టైమ్ ట్రావెల్ మూవీ 'వారణాసి'. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాష్‌రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను వారణాసి అండ్ టీమ్ తెరకెక్కిస్తున్నట్లుగా తెలిసింది. గత ఏడాది నవంబరులో 'వారణాసి టు ది వరల్డ్' వీడియోను రిలీజ్ చేసింది యూనిట్. ఈ వీడియోలో మహేశ్‌బాబు ఎంట్రీ సీన్ గుర్తుండే ఉంటుంది. ఈ సన్నివేశాలకు సంబంధించిన యాక్షన్ సీక్వెన్స్‌లను ప్రస్తుతం తెరకెక్కిస్తున్నారట. ఈ ఫైట్ ఎపిసోడ్ 'వారణాసి'కి ఎంతో కీలకమైనదని తెలిసింది. కాగా, ఈ చిత్రం కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వారణాసి సెట్‌ని రూపొందించిన విషయం తెలిసిందే. ఈ సెట్‌లోనే తాజా ఫైట్ షూట్ జరుగుతోందని టాక్. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.

# ఇప్పటి కాలం వేరు.. మా పిల్లకు అదే చెబుతాం: కుష్బూ సుందర్



''ఇంతకు ముందు పెళ్లి వ్యవహారాన్ని హీరోయిన్లు రహస్యంగా మార్చేశారు. ఇప్పుడు కాలం మారింది. యువతరం కొత్తగా ఆలోచిస్తున్నారు. వారితో పాటు మనం మారుతున్న పరిస్థితి. మా పెద్ద అమ్మాయి అవంతికకు పెళ్లి జరగబోతోంది. ఆమె హీరోయిన్ ఎంట్రీ ఇచ్చి రెండు చిత్రాల్లో నటించారు. మరో రెండు చిత్రాల్లో నటించనున్నారు. ఇక మా రెండో కూతురు ఆనందిత కూడా చిత్ర నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. ఆమె నిర్వహణ బాధ్యతలను నిర్వహించిన తొలి చిత్రం డబుల్ ఆక్యుపెన్సీ. గత 12 వ తేదీన విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణతో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది.

ఈ చిత్ర విజయంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఇది పూర్తిగా కెమెరా ముందు, వెనుక పని చేసిన టీమ్ కే చెందుతుంది. కష్టపడి సంపాదించిన డబ్బుతో చిత్రం చేయడానికి థియేటర్ లకు కుటుంబసమేతంగా వచ్చే ప్రేక్షకులకు పైసా వసూల్ అని చెప్పుకుంటూ జాలీగా బయటకు వెళ్లాలనే నేను, సుందర్ సి మా పిల్లలకు చెబుతాం.

అదే విధంగా ఇక్కడ మీకంటే ఎవరు ఎక్కువ కాదు. ప్రతిభను చాటుతూ శ్రమిస్తే విజయం తథ్యం అని చెపుతాం. ఆ విధంగా చిత్ర నిర్మాణ రంగంలో మా రెండవ కూతురు ఆనందిత మంచి విజయాన్ని అందుకుంది. ఈ చిత్ర యూనిట్ కు నేను ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేయబోతున్నాం. దీనికి సంబంధించిన ప్రకటన త్వరలోనే వెల్లడిస్తాం'' అని డబుల్ ఆక్యుపెన్సీ చిత్ర సక్సెస్ మీట్ లో నటి, నిర్మాత కుష్బూ సుందర్ పేర్కొన్నారు.

వైవిధ్య భరిత ప్రేమ కథా చిత్రంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని అవ్వీ మూవీస్, బెంచ్ మీడియా సంస్థలు కలిసి నిర్మించారు. అశ్విన్ కందస్వామి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సంతోష్, సంయుక్త విశ్వనాథన్, రేష్మా వెంకటేష్, వినోద్ కిషన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు.



# కుర్రాళ్లను ఫిదా చేస్తున్న డింపుల్..

అందం అభినయం ఉన్న ఈ గ్లామర్ బ్యూటీ తన వయ్యారంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది డింపుల్ హయతి. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. హీరోయిన్ గానే కాదు.. గెస్ట్ రోల్స్ చేసింది.అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. డింపుల్ హయాతి 2017లో 'గల్ఫ్' సినిమాతో సినీ రంగంలోకి వచ్చింది.2019లో యురేక సినిమాలో నటించింది. 'గద్దలకొండ గణేష్' సినిమాలో 'జర్ర జర్ర' పాటలో నటించింది. ఈ సాంగ్ లో హాట్ లుక్ లో కనిపించి ఆకట్టుకుంది. 2022లో ఖిలాడి సినిమాలో నటించింది. ఈ సినిమాలో కూడా తన గ్లామర్ తో కవ్వించింది. కానీ సినిమా పెద్దగా హిట్ అవ్వలేదు. చివరిగా రవితేజ నటించిన భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాలో కనిపించింది. కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్. బోగి అనే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాలో డింపుల్ హీరోయిన్ నటిస్తుంది.



# సినిమా ఆఫర్ చేసి.. బాడీ కొలతలు అడిగాడు : మౌనీషా

అవకాశాల పేరుతో అమ్మాయిలను వాడుకునేందుకు ప్రయత్నిస్తారనే అపవాదు సినిమా ఇండస్ట్రీపై ఉంది. అది నిజమనే చెబుతోంది మోడల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మౌనీషా చౌదరి. అమెరికాలో ఉంటూ మోడల్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న మౌనీషా రీసెంట్‌గా ఇండియాకు వచ్చింది. తాజాగా ఓ న్యూస్ చానల్ నిర్వహించే టాక్ షోలో పాల్గొని..తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ సందర్భంగా 'తెలుగులో మీకు మూవీ ఆఫర్స్ వచ్చాయా?' అని హోస్ట్ అడగగా.. ఆఫర్స్ వచ్చినా తాను చేయలేదని చెబుతూ.. దానికి గల కారణం ఏంటో వివరించింది.

'నేను 1617 ఏళ్ల వయసులో ఉన్నప్పుడే సినిమా చాన్స్‌లు వచ్చాయి. ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ఓ సారి ఒకరు వచ్చి 'సినిమాలపై ఆసక్తి ఉందా? హీరోయిన్‌గా చేస్తావా?' అని అడిగాను. నాకు ఏం చెప్పాలో అర్థం కాలేదు. వెంటనే అతను బాడీ కొలతలు ఎంత? నీ తొడల సైజ్ ఎంత? అని అడిగాడు. చాలా భయపడిపోయా. అలా చిన్న వయసులోనే నాకు సినిమా ఇండస్ట్రీపై భయం ఏర్పడింది. ఇంకోసారి ఇండియా టూరిజమ్ యాడ్ కోసం అప్రోచ్ అయ్యారు. వాళ్ళు ఆడిషన్ కి రావడమే ఒక మినీ స్కర్ట్ క్రాప్ టాప్ వేసుకుని రండి అని చెప్పారు.

ఇండియా టూరిజమ్ కి మినీ స్కర్ట్ క్రాప్ టాప్ కి సంబంధం ఏముంది ? హీరోయిన్ అవ్వాలంటే బాడీ కొలతలు ఇవన్నీ ఎందుకండీ ? నటన వచ్చా రాదా అని అడగండి ఫస్ట్ ..రాదు అంటా ఆ సరే దొబ్బెయ్ అనాలప్పుడు అంతే అయిపోతుంది' అని మౌనీషా చెప్పుకొచ్చింది. చిన్నప్పుడు ఏర్పడిన భయంతో ఇప్పటికీ సినిమాల్లో నటించాలంటే భయంగానే ఉంటుందని చెప్పింది. ఇటీవల విశ్వక్‌సేన్ కొత్త సినిమాలో కీలక పాత్ర కోసం అడిగారు. భయంతో నో చెప్పానని మౌనీషా అన్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలోనూ మౌనీషా దీని గురించి చెబుతూ.. తనను కొలతలు అడిగిన వ్యక్తి ఇప్పుడు పెద్ద డైరెక్టర్ అయిపోయాడని.. స్టార్స్‌తో సినిమాలు చేస్తున్నాడని చెప్పింది.

# గ్లామర్ చూపించేసిన రష్మిక.. బాలీవుడ్ ఏమంటోంది?

ఈ వీకెండ్ ఇద్దరు స్టార్ హీరోయిన్లు తమ సినిమాలతో వచ్చారు. మామూలుగా చెప్పకొంటే ఇందులో అంతేం ఉందని అనిపిస్తుంది. కానీ ఈ రెండు మూవీస్ కూడా ఆయా హీరోయిన్లు పెళ్లి చేసుకున్న తర్వాత వచ్చినవి కావడంతో కాస్త ఆసక్తి నెలకొంది. సమంత 'మా ఇంటి బంగారం' పాస్ మార్కులు వేయించుకుంది. మరి రష్మిక 'కాక్‌టెయిల్ 2' టాక్ ఏంటి? ప్రేక్షకులు ఏమంటున్నారు?రష్మిక ఇదివరకే హిందీలో గుడ్ బై, థామా, ఛావా, యానిమల్, మిషన్ మజ్ను తదితర సినిమాలు చేసింది. అయితే వీటిలో యానిమల్, ఛావా మాత్రమే మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ఇప్పుడు 'కాక్‌టెయిల్ 2'తో వచ్చేసింది. షాహిద్ కపూర్, కృతి సనన్‌తో కలిసి రష్మిక స్క్రీన్ షేర్ చేసుకుంది. అయితే ఈ మూవీకి దాదాపుగా నెగిటివ్ టాక్ వచ్చింది. కానీ స్టార్స్ ఉండటం వల్ల కలెక్షన్స్ పర్లేదనిపిస్తున్నాయి.మరీ ముఖ్యంగా ఇప్పటితరానికి కనెక్ట్ అయ్యే లివ్ ఇన్ రిలేషన్, గ్లామర్ లాంటివి ఉండటంతో కాస్తోకూస్తో యూత్ వస్తున్నారు. అయితే ఇది హిందీ వరకే రిలీజ్ చేశారు. సోషల్ మీడియా అంతా కూడా కృతి సనన్ సూపర్ అన్నట్లు ఆకాశానికెత్తేస్తున్నారు. అయితే బాలీవుడ్‌లో పీఆర్ చాలా ఉంటుంది. మరి నిజంగానే కృతి బాగా చేసిందా లేదంటే రష్మికని సైడ్ చేయడానికి కృతిని పొగిడేస్తున్నారా అని సందేహం కలుగుతోంది. ప్రస్తుతానికైతే నెగిటివ్ టాక్ నడుస్తోంది. వీకెండ్ పూర్తయితే ఫలితం ఏంటనేది పూర్తి క్లారిటీ రావొచ్చు. 'కాక్‌టెయిల్ 2' విషయానికొస్తే.. షాహిద్ కపూర్, రష్మిక పాత్రలు లివ్ ఇన్ రిలేషన్‌లో ఉంటారు. ఓ సందర్భంలో రష్మిక పాత్ర విదేశాలకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో తన బాయ్ ఫ్రెండ్ ఎంత నిజాయతీపరుడో తెలుసుకునేందుకు రష్మిక, తన ఫ్రెండ్ కృతి సనన్ సాయం అడుగుతుంది. సరదాగా పరీక్షిద్దాం అనుకుంటే మొత్తం సీన్ మారిపోతుంది.





# హిట్ కోసం ఎదురుచూస్తున్న అందాల భామ ఫరియా అబ్దుల్లా

ఫరియా అబ్దుల్లా..2021లో తెలుగులో వచ్చిన జాతిరత్నాలు సినిమా ద్వారా ఆమె సినిమారంగ ప్రవేశం చేసింది. సినిమాల్లోకి రాకముందు మోడలింగ్, థియేటర్ ఆర్టిస్ట్‌గా, యూట్యూబర్‌గా పలు వీడియోలు చేసింది. నక్షత్ర అనే వెబ్ సిరీస్‌లో నటించింది.ఫరియా అబ్దుల్లా 1998, మే 28న హైదరాబాదులోని బంజారాహిల్స్ లో జన్మించింది. తండ్రి సంజయ్ అబ్దుల్లా, తల్లి కౌసర్ సుల్తానా.ఆమె తన పదవ తరగతి వరకు మెరిడియాన్ అండ్ భవన్స్ లో పూర్తి చేసింది. హైదరాబాదు లయోలా కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ చదివింది. జాతిరత్నాలు తర్వాత అఖిల్ హీరోగా నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలో చిన్న పాత్ర చేసింది.అలాగే నాగార్జున, నాగ చైతన్య బంగార్రాజు సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. ఈ సాంగ్ లో తన డాన్స్ తో ఆకట్టుకుంది ఈ బ్యూటీ..తర్వాత వరుసగా సినిమాలు చేసింది కానీ హిట్స్ అందుకోలేకపోయింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను కవ్విస్తుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com